జనరాజకీయం కోసం... రూ॥ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-1 సంచిక - 21 పక్షపత్రిక నవంబరు 1-15, 2010



## రాజకీయాలకతీతంగా రైతు ఉద్యమం

## గ్రామగ్రామాన సమరశంఖం పూరిస్తున్న డా॥ జయప్రకాష్ నారాయణ్

# గుంటూరు జిల్లాలో జేపీ



















**మన ఆర్థిక రంగంలో ఒక్క రైతు మాత్రమే ప్రతి వస్తువును రిటైల్‌గా ఎక్కువ ధరలకు కొని తన వస్తువులన్నింటినీ టోకుగా చౌకధరలకు అమ్మి రెండువైపులా రవాణా ఖర్చులను తానే భరిస్తాడు.**

– జాన్ ఎఫ్. కెనడీ

## లోపలి పేజీల్లో...


వ్యవసాయంలో స్వేచ్ఛా వాణిజ్యం.................. 5
పొంతన లేని మద్దతు ధర అంశాలు............ 7
పంటల విస్తీర్ణం – దిగుబడి......................... 8
అన్నదాతలకు అండగా ఉద్యమం.................10
అవినీతిపై మహోద్యమం...............................12
మైక్రోఫైనాన్స్‌పై కఠినంగా వ్యవహరించాలి.....15
రైతులకై రాజకీయాలకతీతంగా పోరాటం..... 16
ఎస్.సి, ఎస్.టి. కమీషన్.............................. 19
రైతులు ఏకం కావాలి................................. 19
అంత్యోదయకు అమడదూరం..................... 20
భూతల స్వర్గంలో రక్తపాతం........................ 22
గుంటూరు, కృష్ణా జిల్లాల్లో డా॥ జేపీ................24
జిల్లాల సమాచారం.................................... 30


# వీసీల నియామకంలో యూజీసీ మార్గదర్శకాలను యథాతథంగా అమలు చేయాలి

**సంపాదకీయం**

విశ్వవిద్యాలయాల ఉపకులపతుల (వీసీల) ఎంపిక ప్రక్రియలో కీలక మార్పులంటూ రాష్ట్రప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం గుడ్డికన్నా మెల్ల చాలా గొప్పదని చాటుతున్న చందంగా ఉంది. వీసీల ఎంపికలో కులపతిగా గవర్నర్‌దే అంతిమనిర్ణయమంటూనే తాము ఎంపిక చేసిన ముగ్గురిలో ఒకరి పేరుకు గవర్నర్ విధిగా ఆమోదం తెలపాల్సిన నిబంధనను జోడించటం ప్రభుత్వ కపట ధోరణిని బైటపెడుతోంది.

వైస్‌ఛాన్సలర్ ఎంపిక కమిటీని తన గుప్పెట్లో ఉంచుకోవటం ద్వారా ప్రభుత్వం విశ్వవిద్యాలయాల మీద తన కర్రపెత్తనాన్ని కొనసాగిస్తూ రాజకీయ, సంకుచిత ప్రయోజనాలను కాపాడుకునే ప్రయత్నం చేసింది. ఈ ధోరణిని లోక్‌సత్తా తీవ్రంగా గర్హిస్తోంది. మానవవనరులను అభివృద్ధి పరిచి దేశాభివృద్ధి దిశగా మళ్లించే కీలకపాత్ర వహించే విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్‌ల ఎంపికలో కులం, మతం, ప్రాంతం, భాష వంటి ప్రభావాలు, ప్రభుత్వ జోక్యం ఎంతమాత్రం ఉండకూడదు.

వైస్‌ఛాన్సలర్ల నియామకానికి అన్వేషణ కమిటీ ఏర్పాటు దగ్గర్నుంచి, దరఖాస్తుల ఆహ్వానం, పరిశీలన తదితర అంశాలన్నిటిపై యూజీసీ సిఫార్సు చేసిన మార్గదర్శక సూత్రాలనే పాటించాలి. "అన్వేషణ కమిటీకి గవర్నర్ నియమించే అధికారినే ఛైర్‌పర్సన్‌గా వేయాలన్న యూజీసీ సిఫార్సును విధిగా అమలు చేయాలి. దేశవ్యాప్తంగా అత్యున్నత మేధస్సు, ప్రతిష్ఠ, విద్యారంగం పట్ల ఆర్తి, పూర్తి అవగాహన, ఆర్థిక, ఉపాధి విధానాలపై ఆచరణాత్మక అంచనా కలిగిన వారిని వీసీలుగా నియమించేందుకు వీలుగా బహిరంగ ప్రకటనల ద్వారా దరఖాస్తులను ఆహ్వానించాలి". దేశాభివృద్ధికి మౌలికమైన విద్య వంటి రంగాల్లో కూడా రాజకీయాలు చేయటం, ఆశ్రిత పక్షపాత నియామకాల్ని ప్రభుత్వం మానుకుని వ్యవస్థల పట్ల ప్రజల్లో గౌరవాన్ని కలిగించే దిశగా చర్యలు తీసుకోవాలి. వీసీల నియామకంపై ఆర్డినెన్స్‌లో లోపాల్ని సరిదిద్దాలి. ◆

**సహాయపడే మనసున్న వారికే - విమర్శించే హక్కు ఉంటుంది** – అబ్రహాం లింకన్

## లోక్‌సత్తా టైమ్స్ - కొత్త రాజకీయ పక్షపత్రిక

*నవంబర్ 1-15, 2010 సంపుటి - 1 సంచికలు - 21*

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082
ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**


# సుభాషితం

**ఒక దేశ సంపద మూడు రకాలుగా పెంపొందుతుంది.**

**మొదటిది:** రోమన్‌లు చేసినట్లుగా యుద్ధాలు చేసి తమ పొరుగువారిని జయించి వారి సంపదలను కొల్లగొట్టడం ద్వారా ఇది దోపిడీ అవుతుంది.

**రెండవది:** వ్యాపారం చేయడం ద్వారా సర్వసాధారణంగా ఇది మోసపూరితమై వుంటుంది.

**మూడవది:** వ్యవసాయం చేయడం ద్వారా నిజానికి ఇది ఒక్కటే నిజాయితీగలదు. రైతు భూమిలో చల్లిన విత్తనాలు భగవంతుడి కృపతో ఒక మహాద్భుతంగా తన అమాయకపు జీవితానికి, విలువైన కష్టానికి ప్రతిఫలంగా కొన్ని వేల రెట్లై ధాన్యపుపంటగా దేశాన్ని సుసంపన్నం చేస్తాయి.

**– బెంజిమిన్ ఫ్రాంక్లిన్**

**మీరూ రాయండి :** లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.

**సాహసించి పనులు చేసే వారికే గెలుపు సొంతం అవుతుంది** – సంస్కృతి సూక్తి

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజీ | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/ డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు

### మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా

ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com

### లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ- మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500


బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**
ఫొటోలు : **ఎన్. సంజీవ్ కుమార్**

# దేశానికి, రైతులకు లాభదాయకంగా వ్యవసాయంలో స్వేచ్ఛా వాణిజ్యం

- డా॥ జయప్రకాష్ నారాయణ్

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో పండించే కేవలం ఒక్క వెరైటీ బియ్యాన్ని ఎగుమతి చేసినా ఈ ఏడాది భారత ప్రభుత్వం కనీసం రూ. 50,000 కోట్ల లాభాన్ని ఆర్జించగలుగుతుంది. ఆర్థికవేత్త కూడా అయిన ప్రధానమంత్రి... కేవలం విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించటానికే కాకుండా రైతుల్లో నానాటికీ పెరిగిపోతున్న నిరాశనిస్పృహల్ని తగ్గించేందుకు ఈ చారిత్రక అవకాశాన్ని ఆయన వినియోగించుకోవాలి. లైసెన్స్ రాజ్యం నుంచి పారిశ్రామికరంగాన్ని విముక్తం చేసిన ప్రధాని మన్మోహన్ సింగ్ కుప్పకూలిపోయే స్థితిలో ఉన్న వ్యవసాయాన్ని ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాల్సిన సమయం ఆసన్నమైంది.

పంట దిగుబడులు పుష్కలంగా రానున్న తరుణంలో, ఆహారధాన్యాలతో గోదాములు ఏమాత్రం ఖాళీలేకుండా నిండుకుండల్లా వుండి వరి ధాన్యం ధరలు కుప్పకూలి రైతుల్ని నాశనం చేసే ప్రమాదకర పరిస్థితి నెలకొంది. దీపావళి వెలుగుల్ని ఆస్వాదించే పరిస్థితి లేకుండా గ్రామాలు చీకటిమయ వాతావరణంలో ఉన్నాయి.

అక్టోబర్ నెలలో 1.6 కోట్ల టన్నుల ఆహారధాన్యాల నిల్వలు అవసరముండగా ప్రభుత్వం వద్ద ఇప్పుడు 4.6కోట్ల టన్నుల నిల్వలు ఉన్నాయి. రైతులు, ట్రేడర్ల వద్ద అదనంగా మరో 2కోట్ల టన్నుల ధాన్యాల నిల్వలు ఉండే అవకాశముంది. వర్షాలు పుష్కలంగా కురిసి సాగువిస్తీర్ణం పెరగటం వల్ల దేశం ఈసారి రికార్డుస్థాయి దిగుబడిని సాధించే పరిస్థితి ఉంది. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కనీసం సాగుఖర్చులకు కూడా సరిపోదు. కనీస మద్దతు ధర... గరిష్ట అమ్మకపు ధరగా మారిపోయింది.

ప్రస్తుత పంట సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ 1కోటీ 48లక్షల టన్నుల బియ్యంతో కలిపి రికార్డుస్థాయిలో 2కోట్ల 9లక్షల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తిని సాధించగలదని ప్రభుత్వ అంచనాలు చెబుతున్నాయి. తన అంతర్గత అవసరాలకు 72లక్షల టన్నుల కంటే ఎక్కువ బియ్యం రాష్ట్రానికి అవసరం లేదు. అంటే, రాష్ట్ర ఆహారధాన్యాల ఉత్పత్తిలో మూడింట రెండొంతులు మిగులుగానే చెప్పుకోవాలి. అంతకుముందు పంటకు సంబంధించి రైతులు, ట్రేడర్ల వద్దనున్న భారీ నిల్వల్ని పరిగణనలోకి తీసుకోకుండానే ఇంత పెద్దఎత్తున మిగులు ఉంటుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ రైతుల్ని సంకెళ్లతో బందీలుగా చేశాయి. వ్యవసాయరంగంలో ప్రభుత్వం అతి పురాతన కాలంనాటి విధానాల్నే కొనసాగిస్తోంది. అవినీతి, అనాలోచిత లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్యం వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేస్తోంది. వ్యవసాయంలో ఉత్పత్తి కూడా వాతావరణ దేవతల మీద, తెగుళ్ల మీద, నాణ్యమైన ఇన్‌పుట్లు, సకాలంలో పనిసిబ్బంది అందుబాటులో వుండటం మీద ఆధారపడి ఉంది. మూడుపంటల్లో ఏ ఒక్కటి పోయినా రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. కానీ ప్రభుత్వ విధానాలు ఎంత దారుణంగా ఉన్నాయంటే, అన్ని ఆటంకాల్నీ అధిగమించి మంచి పంట వస్తే ధరల్ని దెబ్బతీస్తున్నారు... పంట విఫలమైతే రైతు సర్వం కోల్పోతాడు, పంట దిగుబడి బాగా ఉంటే భారీగా నష్టపోతాడు.

అటువంటి నేపథ్యంలో ధాన్యం ధరలు కుప్పకూలిపోతుండటం ఆశ్చర్యకరమేమీ కాదు. కరవు, వరదల నేపథ్యంలో బాస్మతేతర బియ్యంపై గత ఏడాది విధించిన నిషేధాన్ని కేంద్రప్రభుత్వం కొనసాగిస్తోంది. రాష్ట్రప్రభుత్వం బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు, మన రాష్ట్రంలోని వివిధ జిల్లాల మధ్య స్వేచ్ఛగా పంపిణీకి అనుమతించటం లేదు. కేవలం పరిమిత నిల్వల్ని మాత్రమే, అది కూడా పర్మిట్లతో ద్వారా తమకు అనుకూల కారణాలతో చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం సరాసరి దిగుబడి బస్తా 75 కిలోల చొప్పున 22 బస్తాలు లేదా 16.5 క్వింటాళ్లు. ఎకరా సాగువ్యయం రైతుకు రూ. 16,000 అవుతుండగా, కౌలురైతుకు రూ. 25,000 అవుతోంది. ఒకవేళ ప్రభుత్వం క్వింటాలుకు రూ. 1000/ రూ. 1030 మద్దతు ధరను అందించినా, రైతుకు కేవలం తన పెట్టుబడి మాత్రమే వస్తుంది, కౌలురైతుకు నికరంగా నష్టం వస్తుంది. పంట ఇప్పటికే మార్కెట్‌యార్డుల్లోకి వచ్చిన ప్రాంతాల్లో కొనుగోలు ధరలు కనీస మద్దతు ధర కంటే కూడా తక్కువగా ఉన్నాయి.

దేశంలో గోదాముల్లో పేరుకుపోతున్న నిల్వలు సమస్యల్ని అధిగమించి, అంతర్జాతీయ మార్కెట్లలో భారీగా పెరుగుతున్న ధరల వల్ల లాభం పొందేందుకు విజ్ఞత గల ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్యాన్ని, ఎగుమతుల్ని ప్రోత్సహించాలి. బియ్యం ఎగుమతులకు ప్రైవేటు వర్గాలకు లైసెన్సులు ఇచ్చి పక్షపాతం, బంధుప్రీతి, అక్రమాలు వంటి ఆరోపణలు ఎదుర్కోకుండా ప్రభుత్వం తన సంస్థల ద్వారా మాత్రమే ఎగుమతుల్ని చేసే ఏర్పాటు చేయవచ్చును.

బియ్యం తినే అన్ని దేశాల్లో మంచి డిమాండ్ ఉన్న ఒక సూపర్‌ఫైన్ రకం సోనా మసూరి (బి.పి.టి 5204) బియ్యాన్ని ప్రభుత్వం ఎగుమతి చెయ్యాలి. ప్రస్తుత ఖరీఫ్ దిగుబడి తర్వాత ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో సోనా మసూరి మిగులు నిల్వ కనీసం 1కోటి టన్నులు ఉంటుంది.

**ఎగుమతి లాభంతో రైతులకు భారీ బోనస్**

అంతర్జాతీయ మార్కెట్లలో సోనా మసూరి తొమ్మిది కేజీల

బ్యాగు ధర 24-27 డాలర్లు పలుకుతోంది. రూపాయల్లోకొస్తే అది కిలోకు రూ.120-135 లేదా ఒక క్వింటాలుకు రూ.12,000-13,500గా ఉంటుంది. పాకిస్తాన్, థాయ్‌లాండ్, ఇండొనేషియా, ఫిలిప్పిన్స్, మరికొన్ని దేశాల్లో వరదల బీభత్సం వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో ఆ ధర మరింత పెరిగే అవకాశముంది. నిల్వ, రవాణా తదితర ఖర్చులుపోగా కిలోకు రూ.80 మాత్రమే ప్రభుత్వం లెక్కవేసుకున్నా 1కోటి టన్నుల బి.పి.టి బియ్యం ఎగుమతి వల్ల ప్రభుత్వానికి రూ.50,000 కోట్ల లాభం వస్తుంది.

ప్రభుత్వం 50శాతం లాభాన్ని అట్టిపెట్టుకుని మిగిలింది రైతులకు బోనస్ రూపంలో పంచవచ్చును. సోనా మసూరి రైతులకే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లోని ధాన్యం రైతులందరికీ వచ్చే నాలుగేళ్లపాటు క్వింటాలుకు రూ.500 బోనస్‌గా చెల్లించవచ్చును.

**రైతు తలసరి ఆదాయం ఏటా రూ.15,000, అదే వ్యవసాయేతర వృత్తుల్లో రూ.1,04,000**

**ఇది శాపం కాదు- పాలకుల పాపం**

దేశజనాభాలో 60శాతం ఆధారపడిన వ్యవసాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాశనం చేస్తున్నాయి. భారతదేశంలో కేవలం వ్యవసాయం మీద ఆధారపడిన రైతుల, కౌలురైతుల తలసరి ఆదాయం ఏడాదికి రూ.15,000 కాగా, వ్యవసాయేతర వృత్తుల్లో ఉన్న వారి తలసరి ఆదాయం రూ.1,04,000గా ఉంది. 60శాతం ప్రజలు కనీస స్థాయిని దాటి జీవించలేకపోతూ పారిశ్రామలు ఉత్పత్తి చేసే వస్తువుల్ని కొనలేకపోతుంటే పారిశ్రామికరంగం ఎలా అభివృద్ధి చెందుతుంది? ఇది ప్రకృతి శాపం కాదు, పాలకుల పాపం.

సౌకర్యాలు, విలాసాలు మాట అలా ఉంచి కనీసం రెండు పూటలా సరైన భోజనం కూడా వ్యవసాయదారునికి గ్యారంటీ లేకపోవటం వల్లే పల్లె ప్రాంతాల్లోని ఏ రైతూ తన కూతుర్ని మరో రైతుకి ఇచ్చి పెళ్లి చేయటానికి లేదా తన కొడుకుని వ్యవసాయ వృత్తిలోకి తీసుకురావటానికి ఇష్టపడటంలేదు. ఈ పరిస్థితుల్లో గ్రామాలకు గ్రామాలు ఖాళీ అవుతున్నాయి.

తక్కువ ధరకు ఉత్పత్తి చేయటం వల్ల భారతీయ రైతు అంతర్జాతీయ మార్కెట్లో మంచి లాభాలను ఆర్జించవచ్చని చెబుతూ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.వొ)లో భారత్ చేరటాన్ని డా॥ మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ ఆనాడు సమర్థించారు. బియ్యం ఉత్పత్తిలో మనం చాలా లాభదాయక స్థితిలో ఉన్నాం. కానీ ఎగుమతుల్ని అనుమతించకుండా, అంతర్జాతీయ మార్కెట్లలో అధిక ధరల ద్వారా మన రైతులు లాభపడకుండా మన ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అదేసమయంలో, దిగుమతి విషయంలో పూర్తివిరుద్ధంగా వ్యవహరిస్తూ పన్ను లేకుండానే బియ్యం, గోధుమల్ని దిగుమతి చేసుకుంటోంది. మరోవైపు, నూనెగింజల ఉత్పత్తిలో మనం అననుకూల పరిస్థితులో ఉన్నాం. రైతుల్ని ప్రోత్సహించేందుకు రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఒక నూనెగింజల మిషన్‌ను ఏర్పాటు చేసిన, ప్రభుత్వ అసంబద్ధ విధానాల పుణ్యమాని భారతీయ వంటనూనె ఇక గతకాల విషయంగా మారిపోనుంది.

ఫంగేషియస్ రకం చేపను వియత్నాం, బంగ్లాదేశ్, బర్మా తదితర ఆసియాన్ దేశాల నుంచి సుంకం తీసుకోకుండా దిగుమతి చేసుకోవటం వల్ల భారత్‌లో ఆ చేప ధర రూ.50 నుంచి రూ.30కి పడిపోయింది. పత్తి ధరలు రైతులకు అనుకూలంగా పెరిగినప్పుడు కూడా ఎగుమతుల్ని నిషేధించి, అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు కూడా దిగుమతుల్ని అనుమతిస్తున్నారు. అలాగే మూడేళ్ల క్రితం చెరకు రైతులకు రూ.1000 కూడా ఇవ్వకుండా లక్షలాది రైతుల్ని నాశనం చేశారు. దాని ఫలితంగా చెరకు విస్తీర్ణం తగ్గిపోయి ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. దాంతో ఈ ఏడాది 50లక్షల టన్నుల పంచదారను దిగుమతి చేసుకునే గతిపట్టింది. భారతీయ రైతుకు ఎప్పటికీ మంచి ధర లభించకూడదు, వ్యవసాయం ఎప్పటికీ కనీసస్థాయి ఆదాయం దాటని వృత్తిగానే మిగిలిపోవాలి- అనేదే ప్రభుత్వ ఏక సూత్ర కార్యక్రమంగా ఉంది.

**సొంతరైతులకు వ్యతిరేకంగా భారత ప్రభుత్వం**

భారత ప్రభుత్వం చేసినట్టు ప్రపంచంలోని ఏ ప్రధాన దేశం కూడా తన సొంత రైతులకు వ్యతిరేకంగా పనిచేయటం లేదు. మన వ్యవసాయాన్ని నాశనం చేసి, రైతుల్ని, కౌలురైతుల్ని నిరుపేదలుగా మార్చి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయాలనుకుంటే ప్రభుత్వం ఇంతకంటే ఇంకేమీ చేయనక్కర్లేదు. వ్యవసాయంలో అసంబద్ధ, దేశ వ్యతిరేక విధానాల వల్ల మనకు మార్కెట్ అవకాశాలు, లాభాలు, విదేశీ మారక ద్రవ్యం, వ్యవసాయ ఆదాయం లభించటం లేదు. ప్రభుత్వం నిస్సిగ్గుగా రైతుల్ని, కౌలుదారుల్ని దోపిడీ చేస్తూ దేశ జనాభాలో 70 శాతం జనాభా నివసిస్తున్న గ్రామాలను ఆర్థికంగా చిదిమేస్తోంది. దీనివల్ల మిగిలిన ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతింటోంది. పారిశ్రామిక ఉత్పత్తులు, సేవలు కేవలం 30శాతం ప్రజలకే పరిమితమవుతున్నాయి. భారతదేశ ఆర్థిక ప్రగతిని వెనక్కిలాగే రీతిలో ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. అంతిమంగా ఆర్థికవ్యవస్థ స్తంభించి దేశం భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది.

**బంగారం తాకట్టు పెట్టిన రోజుల్ని గుర్తుచేసుకోండి...**

**సరళీకరణతో రైతుల సంకెళ్లు తెంచండి**

1990లలో భారత ప్రభుత్వం నిబద్ధత వల్లకాకుండా అనివార్య పరిస్థితుల వల్లే ఆర్థిక వ్యవస్థను సరళీకృతం చేసింది. ఎరువులు, ఇంధనం దిగుమతులకు చెల్లింపులు జరిపేందుకు, రుణం చెల్లించలేక చేతులెత్తేసే వైఫల్యాన్ని తప్పించుకునేందుకు బంగారాన్ని, ఆత్మగౌరవాన్ని లండన్‌లో తాకట్టు పెట్టాల్సివచ్చింది. పారిశ్రామిక రంగానికి సంకెళ్లు తెంపి ఎంటర్‌ప్రెన్యూర్ సామర్థ్యం వెల్లువెత్తేలా చేసిన ప్రభుత్వం ... వ్యవసాయాన్ని నాశనం చేస్తున్న తన భల్లూకపు పట్టును వదులుకోవటానికి సిద్ధపడటం లేదు. ప్రభుత్వం తన మైండ్‌సెట్‌ను సరిచేసుకోవటానికి వ్యవసాయంలో కూడా ఓ భయంకర ఉత్పాతం రావాలా? ◆

# వ్యవసాయ పంటలతో పొంతన లేని కనీస మద్ధతు ధర పరిగణన అంశాలు

**జాతీయస్థాయిలో వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరను సూచించే కమిషన్ పరిగణనలోకి తీసుకునే అంశాలను ఈ కింద ఇస్తున్నాం. రైతులు పంటలకు లాభసాటి ధర అందించడానికి బదులు దానిని నియంత్రించడానికి దోహదం చేసే అంశాలు ఎక్కువగా వుండడం రైతుల పట్ల, వ్యవసాయం పట్ల ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతున్నాయి. ఇన్ని ఆంక్షల మధ్య పంటల ధరలు నిర్ణయించడం వల్లనే అవి లాభసాటి కాకపోగా గిట్టుబాటు కూడా కాని స్థితి వచ్చింది. రైతుల్ని దెబ్బతీసి, దివాళాతీయించి, ఆత్మహత్యలకు దారి చూపిస్తున్న ఈ విధానాలు దేశ ఆహారభద్రతకీ, గ్రామీణాభివృద్ధికీ తీవ్ర విఘాతం కలిగించేవిగా వున్నాయి.**

వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరను సూచించడానికి జాతీయ స్థాయిలో ఒక కమిషన్ వుంది. దీని పేరు వ్యవసాయ పంటల ఖర్చులు, ధరల కమిషన్(Commission for Agricultural Costs and Prices (CACP) కమిషన్ కనీస మద్దతు ధరను సూచిస్తుంది. తుది ప్రకటన కేంద్రప్రభుత్వం చేస్తుంది.

వ్యవసాయ పంటలకు కనీస మద్ధతు ధరను నిర్ణయించడానికి ఈ కింది అంశాలను కమిషన్ పరిగణనలోకి తీసుకుంటుంది.

1. వ్యవసాయ పంటల ఉత్పత్తి ఖర్చు
2. వ్యవసాయ పంటలలో వినియోగించే వస్తువు ధరలలో మార్పులు
3. వినియోగ వస్తువులు – పంట దిగుబడి మధ్య సమతుల్యత
4. మార్కెట్‌లో ధరల ధోరణి
5. డిమాండ్ మరియు సప్లయిల స్థితి
6. వివిధ పంటల ధరవరలలో సమతుల్యత(Parity)
7. పారిశ్రామిక ధరల చట్టంపై ప్రభావం
8. జీవన వ్యయంపై ప్రభావం
9. సాధారణ ధరల స్థాయిపై ప్రభావం
10. అంతర్జాతీయ ధరల పరిస్థితి
11. రైతులు చెల్లిస్తున్న ధరలు అమ్మకం ధరల మధ్య సమతుల్యం
12. ప్రభుత్వం అమ్మకం ధరలు, సబ్సిడీల సమస్యలు

ఈ కమిషన్ క్షేత్రస్థాయి గణాంకాలతో పాటు జిల్లా, రాష్ట్రం, జాతీయ స్థాయిలో మదుపు చేసిన గణాంకాలను వినియోగించు కుంటుంది. ఈ కమిషన్ 25 వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరను సూచిస్తుంది. కనీస మద్దతు ధరను సూచించడానికి ఈ అంశాలలో ప్రయోజనం పొందే వివిధ తరగతుల బృందాలతో చర్చించడానికి ఈ కింది విధంగా వ్యవహరిస్తుంది.

1. రాబోయే పంట సీజనులో పరిగణనలోకి తీసుకోవలసిన ముఖ్యమైన అంశాలను ముందుగా గుర్తిస్తుంది.
2. ఈ కమిషన్ ఒక ప్రశ్నావళిని రూపొందించి సంబంధిత కేంద్ర మంత్రిత్వశాఖలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు, వ్యాపార, పారిశ్రామిక, ప్రోసెసింగ్‌తో సంబంధం వున్న సంస్థలకు, కో ఆపరేటివ్ రంగంలో, ప్రయివేట్ రంగంలో వున్న రైతులకు ఈ ప్రశ్నావళిని పంపుతారు. వారి అభిప్రాయాలను తెలియజేయాల్సిందిగా కోరతారు.
3. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలతో, కేంద్ర మంత్రిత్వ శాఖలు డిపార్ట్‌మెంట్లతో ఇతర సంస్థలతో ప్రత్యేకమైన చర్చలు జరుపుతారు. వివిధ పరిశోధనలు నిర్వహిస్తున్న పార్టీ సంస్థలతో వారు నిర్వహిస్తున్న పరిశోధనలతో దీనికి సంబంధించిన అంశాలపైనా నిర్ధారణపైనా సమాచారాన్ని తీసుకుంటారు.
4. స్థానికంగా రైతుల నుండి, స్థానికంగా ఇతర సంస్థల నుండి అభిప్రాయ సేకరణకు / ప్రత్యక్ష పరిశీలనకు ఈ కమిషన్ కొన్ని ప్రాంతాలలో క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తుంది. ◆

**Minimum Support Prices of various Agricultural Commodities**

| Commodity | | Variety | 2009-10 | 2010-11 |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 9 | 10 |
| **Kharif Crops** | | | | |
| 1 Paddy | | Common | 950& | 1000 |
| | | **Grade 'A'** | 980 | 1030 |
| 2 Jowar | | Hybrid | 840 | 880 |
| | | Maldandi | 860 | 900 |
| 3 Bajra | | | 840 | 880 |
| 4 Maize | | | 840 | 880 |
| 5 Ragi | | | 915 | 965 |
| 6 Arhar(Tur) | | | 2300 | 3000!! |
| 7 Moong | | | 2760 | 3170!! |
| 8 Urad | | | 2520 | 2900!! |
| 9 Cotton | | F-414/H-777/J34 | 2500a | 2500a |
| | | H-4 | 3000aa | 3000aa |
| 10 Groundnut In Shell | | | 2100 | 2300 |
| 11 Sunflower Seed | | | 2215 | 2350 |
| 12 SOYABEEN | | BLACK | 1350 | 1400 |
| | | YELLOW | 1390 | 1440 |
| 13 Sesamum | | | 2850 | 2900 |
| 14 Nigerseed | | | 2405 | 2450 |
| **Rabi Crops** | | | | |
| 15 Wheat | | | 1100 | |
| 16 Barley | | | 750 | |
| 17 Gram | | | 1760 | |
| 18 Masur (Lentil) | | | 1870 | |
| 19 Rapeseed/Mustard | | | 1830 | |
| 20 Safflower | | | 1680 | |
| 21 Toria | | | 1735 | |
| **Other Crops** | | | | |
| 22 Copra | | Milling | 4450 | 4450 |
| (Calender Year) | | Ball | 4700 | 4700 |
| 23 De-Husked Coconut | | | 1200 | 1200 |
| 24 Jute | | | 1375 | 1575 |
| 25 Sugarcane@ | | | 129.84[] | 139.12[]* |
| 26 Tobacco(Vfc) | | Black Soil(F2 Gr) | | |
| (Rs. per kg.) | | Light Soil (L2 Gr) | | |

# ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ పంటలు విస్తీర్ణం- దిగుబడి 2008 - 2009

| క్ర.సం | జిల్లాపేరు | బియ్యం | | నూనె గింజలు | | పప్పుధాన్యాలు | | చెరకు | | పత్తి | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | ఏరియా | దిగుబడి | ఏరియా | దిగుబడి | ఏరియా | దిగుబడి | ఏరియా | దిగుబడి | ఏరియా | దిగుబడి |
| 1 | అదిలాబాద్ | 77,294 | 1,98,382 | 1,17,005 | 1,34,050 | 93,872 | 74,895 | 40 | 339 | 2,79,353 | 6,16,220 |
| 2 | నిజామాబాద్ | 1,90,026 | 6,79,607 | 81,108 | 1,17,745 | 64,579 | 1,02,710 | 10,619 | 84,516 | 11,832 | 29,232 |
| 3 | కరీంనగర్ | 3,35,957 | 11,75,996 | 21,065 | 34,795 | 26,953 | 17,026 | 1,633 | 13,828 | 1,80,127 | 4,25,947 |
| 4 | మెదక్ | 1,23,912 | 3,57,444 | 28,609 | 37,448 | 1,32,266 | 78,695 | 26,002 | 2,12,401 | 49,124 | 1,17,609 |
| 5 | హైదరాబాద్ | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 |
| 6 | రంగారెడ్డి | 32,100 | 92,023 | 18,746 | 22,790 | 55,479 | 36,625 | 1,265 | 10,485 | 17,842 | 48,278 |
| 7 | మహబూబ్‌నగర్ | 1,44,733 | 4,21,209 | 2,15,218 | 2,24,169 | 1,25,146 | 62,204 | 78 | 646 | 90,300 | 1,03,048 |
| 8 | నల్గొండ | 3,61,812 | 11,50,307 | 57,053 | 36,953 | 75,293 | 35,589 | 166 | 1,340 | 1,62,522 | 3,12,616 |
| 9 | వరంగల్ | 2,30,858 | 6,89,972 | 44,688 | 57,371 | 47,393 | 30,341 | 0 | 0 | 1,76,419 | 5,70,767 |
| 10 | ఖమ్మం | 1,94,799 | 5,95,609 | 15,819 | 51,918 | 43,861 | 25,889 | 3,037 | 29,075 | 1,24,516 | 3,17,150 |
| 11 | శ్రీకాకుళం | 2,05,839 | 4,14,566 | 54,257 | 37,223 | 81,068 | 39,908 | 7,139 | 56,455 | 1,802 | 6,477 |
| 12 | విజయనగరం | 1,30,659 | 3,12,009 | 62,579 | 47,205 | 48,399 | 18,614 | 15,900 | 84,808 | 6,798 | 6,358 |
| 13 | విశాఖపట్నం | 1,02,057 | 1,72,343 | 32,578 | 67,894 | 22,462 | 12,558 | 38,998 | 2,24,528 | 204 | 733 |
| 14 | తూర్పుగోదావరి | 4,10,092 | 15,13,257 | 58,187 | 1,17,803 | 79,289 | 23,170 | 13,592 | 1,19,108 | 7,432 | 14,165 |
| 15 | పశ్చిమగోదావరి | 4,50,458 | 16,00,382 | 43,948 | 1,75,747 | 10,303 | 4,208 | 29,394 | 3,05,828 | 3,512 | 12,623 |
| 16 | కృష్ణా | 3,94,533 | 14,27,295 | 14,012 | 91,641 | 1,09,501 | 97,112 | 11,255 | 1,10,298 | 36,669 | 1,31,793 |
| 17 | గుంటూరు | 3,32,849 | 11,46,983 | 8,848 | 14,401 | 76,024 | 72,898 | 762 | 5,963 | 1,66,289 | 6,43,636 |
| 18 | ప్రకాశం | 1,31,391 | 4,82,277 | 63,097 | 68,368 | 1,78,467 | 1,95,574 | 251 | 2000 | 40,781 | 1,31,459 |
| 19 | నెల్లూరు | 2,57,087 | 9,96,798 | 25,319 | 49,735 | 64,954 | 24,003 | 7,825 | 71,439 | 6,879 | 24,724 |
| 20 | కడప | 65,066 | 1,28,439 | 2,42,974 | 1,06,757 | 83,333 | 68,668 | 68 | 536 | 11,467 | 11,669 |
| 21 | కర్నూలు | 1,11,449 | 3,76,929 | 4,11,304 | 3,04,014 | 2,58,804 | 3,40,154 | 1,055 | 9,556 | 23,397 | 32,803 |
| 22 | అనంతపూర్ | 48,722 | 1,44,430 | 9,14,737 | 1,27,282 | 1,09,199 | 82,346 | 131 | 1,229 | 1,611 | 1,241 |
| 23 | చిత్తూరు | 55,523 | 1,64,878 | 1,97,075 | 1,33,196 | 14,828 | 6,759 | 26,916 | 2,31,640 | 24 | 37 |
| | **ఆంధ్రప్రదేశ్** | **43,87,216** | **1,42,41,133** | **27,28,226** | **20,58,505** | **17,71,473** | **14,49,946** | **1,96,126** | **15,75,928** | **13,98,900** | **35,68,585** |

# కొన్ని ప్రధాన వాణిజ్య పంటలు

| సంవత్సరం | నూనె గింజలు | | సంవత్సరం | చెరకు | | సంవత్సరం | పత్తి | |
|---|---|---|---|---|---|---|---|---|
| | ఏరియా | దిగుబడి | | ఏరియా | దిగుబడి | | ఏరియా | దిగుబడి |
| 2004 - 05 | 30,33,666 | 22,06,245 | 2004 - 05 | 2,13,827 | 15,72,863 | 2004 - 05 | 11,78,419 | 21,90,549 |
| 2005 - 06 | 30,40,653 | 20,41,603 | 2005 - 06 | 2,29,960 | 18,64,878 | 2005 - 06 | 10,32,629 | 21,07,984 |
| 2006 - 07 | 23,61,337 | 17,22,236 | 2006 - 07 | 2,64,333 | 23,67,536 | 2006 - 07 | 9,71,806 | 21,81,944 |
| 2007 - 08 | 27,82,094 | 37,65,938 | 2007 - 08 | 2,46,714 | 21,41,960 | 2007 - 08 | 11,33,895 | 34,90,952 |
| 2008 - 09 | 27,28,226 | 20,58,505 | 2008 - 09 | 1,96,126 | 15,75,928 | 2008 - 09 | 13,98,900 | 35,68,585 |

# ఆంధ్రప్రదేశ్‌లో పప్పు దినుసుల పంటలు

| సంవత్సరం | ఉలవలు | | పెసలు | | మినుములు | | కందిపప్పు | |
|---|---|---|---|---|---|---|---|---|
| | ఏరియా | దిగుబడి | ఏరియా | దిగుబడి | ఏరియా | దిగుబడి | ఏరియా | దిగుబడి |
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) |
| 2004 - 05 | 66,547 | 25,555 | 4,54,145 | 1,59,451 | 4,27,512 | 2,58,691 | 4,80,277 | 2,19,006 |
| 2005 - 06 | 56,622 | 21,027 | 3,84,922 | 1,65,320 | 4,21,038 | 2,50,071 | 4,94,523 | 3,00,636 |
| 2006 - 07 | 64,014 | 30,030 | 3,93,914 | 1,43,596 | 4,97,723 | 3,50,088 | 4,01,250 | 1,60,843 |
| 2007 - 08 | 49,746 | 24,521 | 4,38,465 | 1,92,475 | 5,02,720 | 2,49,338 | 4,63,302 | 3,01,604 |
| 2008 - 09 | 39,310 | 16,485 | 3,19,551 | 1,36,200 | 3,38,375 | 2,20,914 | 4,42,714 | 2,01,356 |

# ఆంధ్రప్రదేశ్‌లో ఆహార పంటలు - ఆహారేతర పంటలు

| సంవత్సరం | ఆహార పంటలు | ఆహారేతర పంటలు | మొత్తం |
|---|---|---|---|
| 1999-2000 | 87,62,809 | 42,60,229 | 1,30,23,038 |
| 2000 - 01 | 92,95,455 | 42,49,808 | 1,35,45,263 |
| 2001 - 02 | 86,43,424 | 41,12,935 | 1,27,56,359 |
| 2002 - 03 | 78,92,922 | 36,65,707 | 1,15,58,629 |
| 2003 - 04 | 84,28,223 | 39,38,147 | 1,23,66,370 |
| 2004 - 05 | 78,82,413 | 46,36,135 | 1,25,18,548 |
| 2005 - 06 | 88,08,953 | 45,53,131 | 1,33,62,084 |
| 2006 - 07 | 89,83,509 | 38,27,371 | 1,28,10,880 |
| 2007 - 08 | 91,04,773 | 44,62,225 | 1,35,66,998 |
| 2008 - 09 | 91,22,651 | 47,07,440 | 1,38,30,091 |

# అన్నదాతకు అండగా ఉద్యమం

- రవాణా వ్యవస్థను దిగ్బంధిస్తాం
- మూడు దశల్లో పోరాటం ఉధృతం
- పరిష్కారాలు మేమే సూచిస్తాం
- ఆహార భద్రత పథకం ఒక ఫార్సు

"న్యూస్‌టుడే" ఇంటర్వ్యూలో
డా॥ జయప్రకాష్ నారాయణ్

***ప్రభుత్వాలే రైతుల్ని సర్వనాశనం చేస్తున్న తీరుకి నిరసనగా లోక్‌సత్తా అధినేత డా॥ జయప్రకాష్ నారాయణ్ భారీ ఉద్యమానికి నడుంకట్టారు. రైతుల కోసం పోరాడుతున్న మేధావులు, విజ్ఞులు, రైతు సంఘాల్ని కలుపుకుంటూ ఉద్యమనిర్మాణం చేపట్టారు. సాధారణంగా శాంతియుత నిరసనలకే ప్రాధాన్యమిచ్చే లోక్‌సత్తా అధినేత ఈసారి కాస్త కఠిన వైఖరినే అనుసరిస్తున్నారు. గుంటూరు జిల్లాలో జేపీ ఈనెల 25 నుంచి రైతు ఐక్యత ఉద్యమయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన న్యూస్‌టుడేకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పోరాటపథాన్ని, క్రమాన్నీ వివరించారు.***

**ప్ర: మీ ఉద్యమానికి ప్రభుత్వం దిగి వస్తుందని భావిస్తున్నారా? పోరాటం ఏ విధంగా చేయబోతున్నారు. అంతిమలక్ష్యం ఏమిటి?**

జ: కచ్చితంగా దిగి రావలసిందే. మూడు శాతం రైతులు ఉన్న ఫ్రాన్స్‌లో ఏదైనా సమస్య వస్తే మొత్తం దేశాన్నే కుదిపేస్తున్నారు. ఇక్కడ 60 శాతం రైతులు ఉన్నారు. రైతు తలచుకుంటే ఆర్థిక వ్యవస్థే స్తంభిస్తుంది. పిల్లిని గదిలో పెట్టి కొడితే ఎన్నాళ్లని ఊరుకుంటుంది. మొదట శాంతియుతంగానే ఉద్యమం చేస్తాం. మూడు దశల్లో పోరాటం ఉంటుంది. ప్రతి మండలానికి 15-20 మంది రైతులతో కమిటీలు వేస్తాం. వారికి శిక్షణ ఇస్తాం. కాల్‌సెంటర్ పెడతాం. రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని కరపత్రాలు, బుక్‌లెట్ల ద్వారా ముద్రించి అందరికీ చేరేలా చేస్తాం. మేం శిక్షణ ఇచ్చిన రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడి రైతుల్లో స్ఫూర్తి నింపుతారు. రాష్ట్రం, జాతీయస్థాయిల్లో అర్థవంతమైన పరిష్కారాలు సూచిస్తాం. 7-8 రాష్ట్రాలకు ఉద్యమాన్ని విస్తరిస్తాం. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే రైతులు వీధుల్లోకి రాకతప్పదు. ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా మిగతా రవాణా వ్యవస్థ మొత్తాన్ని స్తంభింపజేస్తాం. కావలసినంత గడువు ఇచ్చి ముందే చెప్పి చేస్తాం. ప్రభుత్వం ఎంతమంది రైతుల్ని కాల్చి చంపుతుంది? 1991లో ఆర్థిక సంస్కరణల తర్వాత పరిశ్రమలకు ఎలాంటి మేలు జరిగిందో... వ్యవసాయ రంగానికీ అలాంటి మేలు జరిగేంత వరకు పోరాటం ఆగదు.

**ప్ర: ఈ పోరాటంలో మీతో కలసి వచ్చేవాళ్లు ఎవరు?**

జ: రైతుల కోసమే 35 ఏళ్లపాటు తన జీవితాన్ని కొవ్వొత్తిలా కరిగించి పోరాడిన శరద్‌జోషి వంటి వాళ్లు చాలామందే ఉన్నారు. వ్యవసాయ రంగంలో పెద్ద పేరు, అనుభవం ఉన్న వాళ్లు, వివిధ రైతు సమాఖ్యలకు చెందిన వారు చాలామందే వస్తున్నారు.

**ప్ర: మీరు చెప్పేవన్నీ చేయాలంటే ప్రభుత్వం దగ్గర డబ్బు ఉండాలి కదా?**

జ: నిర్దిష్ట పరిష్కారం సూచించకుండా మేం ఏదీ డిమాండ్ చేయడం లేదు. ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా రైతుల్ని ఆదుకోవచ్చు. డిమాండ్ ఎక్కువగా ఉండే బీపీటీ-5204 ధాన్యం నిల్వలు ఆంధ్రప్రదేశ్‌లో, కర్ణాటకలో కలిపి కోటి టన్నులు ఉన్నాయి. దేశం మొత్తం మీద ప్రభుత్వ గిడ్డంగుల్లో 4.62 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉన్నాయి. ఈ సంవత్సరం దేశం మొత్తం అవసరాలకు 2.7 కోట్ల టన్నులు సరిపోతాయి. ఖరీఫ్‌లో సేకరించేది కూడా కలిపితే వచ్చే మూడేళ్లకు సరిపడా ఉంటుంది. ఇంత భారీగా నిల్వలు ఉన్నప్పుడు ఎగుమతులకు ఎందుకు అనుమతివ్వరు. బీపీటీ బియ్యానికి విదేశాల్లో విపరీతమైన గిరాకీ ఉంది. దేశ ప్రజల అవసరాలకు సరిపడా నిల్వలు ఉంచి మిగతా ఆహార ధాన్యాలు ఎగుమతి చేస్తే దేశానికి హీనపక్షం రూ.70 వేల కోట్ల ఆదాయం వస్తుంది.ఇదంతా ప్రభుత్వాలకు తెలీకకాదు. రైతులకు న్యాయం చేయడం ఇష్టంలేక చేస్తున్న దురాగతం. ఇదే కాదు... ఇంకా చెరకు, పత్తి, కూరగాయాలు ఇలా ఏ పంటలు వేసే రైతులైనా సరే ప్రభుత్వ అపసవ్య విధానాల వల్ల సర్వనాశనమై పోతున్నారు. రైతు బాగుంటే దేశ ఆర్థిక వ్యవస్తే బాగువడుతుంది. కానీ దీన్ని ప్రభుత్వాలు కావాలనే విస్మరిస్తున్నాయి.

**ప్ర: రైతులు ఎన్ని దశల్లో, ఎక్కడెక్కడ మోసపోతున్నారని మీరు భావిస్తున్నారు?**

జ: నాలుగు దశల్లో, మొదట రైతులకు కావలసిన సమాచారం లేదు. ఏ పంట ఎంత విస్తీర్ణంలో పండిస్తున్నారు? దేనికి గిరాకీ ఉంది? రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల పరిస్థితి ఏంటి? వంటి సమాచారం లేదు. రూ.100 కోట్లు పెడితే ప్రతి మండలంలో ఐదు చొప్పున సమాచారం అందించే కియోస్క్‌లు ఏర్పాటు చేయవచ్చు. ఆ మండలాల్లోని రైతులు అక్కడికి వచ్చి తమ పంటల వివరాలు నమోదు చేయవచ్చు. ఇతర సమాచారం తెలుసుకోవచ్చు. వీటిని ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయడం వల్ల ఎక్కడి సమాచారమైనా క్షణాల్లో రైతుకి అందుతుంది. రెండోది 'ఇన్‌పుట్స్' దగ్గర మోసం జరుగుతోంది. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో రైతు కుదేలవుతున్నాడు. మూడోదశలో కరెంటు, సాగునీరు, కూలీల కొరత, కూలీ ధరలు పెరగడం వంటివి రైతుని నిర్వీర్యం చేస్తున్నాయి. అన్ని కష్టాలు పడి పంట పండిస్తే... దాన్ని రైతు నచ్చిన చోట అమ్ముకోకుండా ప్రభుత్వం పెడుతున్న ఆంక్షలు. సన్నబియ్యం ఇతర రాష్ట్రాలకు వెళ్ళనివ్వబోమని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారంటే పరిస్థితి అర్థమవుతోంది. ఇక నాలుగోది.. ఎక్కువ పంట వచ్చినపుడు మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల ధర లేనప్పుడు తమ ఉత్పత్తుల్ని దాచుకునే సదుపాయం లేకపోవడం రైతుల్ని కుంగదీస్తోంది.

**ప్ర: ఈ దశలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆహారభద్రత పథకాన్ని మీరు ఎలా చూస్తున్నారు?**

జ: అది ఖచ్చితంగా ఒక ఫార్సు. రైతుల వెన్ను విరవడానికి జరుగుతున్న ప్రయత్నం. దాని వల్ల ఎవరికీ మేలు జరగదు. మరింత అవినీతిని ప్రోత్సహించేందుకు తోడ్పడుతుంది. ప్రజల పేరుతో వాటిని మింగే పందికొక్కులు తయారవుతాయి. మన రాష్ట్రంలోనే తీసుకోండి. 2.04 కోట్ల తెల్లకార్డుల్ని 1.92 కోట్లకు తగ్గించారు. అంటే ఒక కార్డుకి నలుగురు వేసుకున్నా 7.7 కోట్ల మందికి ప్రయోజనం చేకూరాలన్న మాట. కానీ రాష్ట్ర జనాభానే అంత అంటే నూరు శాతం జనాభాకు తెల్లకార్డులు ఉన్నట్టే కదా..! కానీ వాస్తవానికి రాష్ట్రంలో లక్షల కుటుంబాలకు తెల్లకార్డుల్లేవు. ఉన్నవారికి సక్రమంగా సరుకులు అందడం లేదు. పీడీఎస్ బియ్యం 30 శాతం రైసు మిల్లుల్లో రీసైక్లింగ్ జరుగుతోంది. ఎఫ్‌సీఐ వాళ్లు, చౌక ధరల దుకాణాల యజమానులు, మిల్లర్లు, అధికారులు బాగుపడుతున్నారు. మిల్లర్లకు పర్మిట్లు ఇది వరకు జిల్లాల్లో ఇచ్చేవారు. కానీ లంచాలు చాలడం లేదని ఇప్పుడు హైదరాబాదులో ఇస్తున్నారు. ఛాలెంజ్ చేసి చెబుతున్నాను. లంచాలు తీసుకునే పర్మిట్లు ఇస్తున్నారు. రైసు మిల్లింగ్‌లో అనుభవం, వ్యవసాయం ఆనుపానులు తెలిసిన వ్యక్తి, ఎన్‌జీ రంగా గారి శిష్యుడు ముఖ్యమంత్రిగా ఉండి కూడా... పర్మిట్లు హైదరాబాద్‌లో ఇవ్వడం దురదృష్టకరం. ◆

* * *

# అధికారుల్లో రుషితుల్యుడు శంకరన్‌కు - జేపీ నివాళి



"పేదలు, దళితులు, ఆదివాసీల పట్ల అపారమైన ప్రేమతో, నిజంగా ఈ దేశం రుషితుల్యునిగా పోరాడిన వ్యక్తి ఎస్. ఆర్. శంకరన్. స్వతంత్ర భారత చరిత్రలోని ఉన్నతా బహు అరుదు".

ఉదాత్త భావాలు, చెప్పింది చేసే తత్వంతో శంకరన్ నిఖార్సయిన నిజాయతీగా మారుపేరుగా నిలిచారు. కానీ ప్రభుత్వాల నుంచి, రాజకీయ పార్టీల నుంచి శంకరన్‌కు గుర్తింపు లేకపోవటం చాలా విచారకరం. ఉన్నతాధికారుల్లో కూడా శంకరన్‌ను అనుసరించటం పోయి, లేకిగా, రాజకీయ పార్టీల పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరించే సంస్కృతి పెరిగిపోయింది. హృదయమంతా ప్రేమను నింపుకుని సమాజం కోసం పరితపించిన శంకరన్ మరణం మన రాష్ట్రానికేకాక యావత్ దేశానికే పెద్ద లోటు అని జయప్రకాష్ నారాయణ్ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

**కావలెను**

- ★ ప్రజాశ్రేయస్సే పరమావధిగా నెలకొల్పబడిన లోక్‌సత్తా పార్టీ భావజాలాన్ని, దైనందిన విషయాలపై లోక్‌సత్తా పార్టీ ప్రతిస్పందనలను ప్రజల్లోకి తీసుకువెళ్ళే సాధనం 'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక.
- ★ ఈ పత్రికకు చందాదారులను చేర్పించేందుకు ఆసక్తిగల యువతీయువకులు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో కావలెను.
- ★ మరిన్ని వివరాలకై స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయాన్నిగాని, రాష్ట్ర ప్రధాన కార్యాలయాన్నిగాని సంప్రదించగలరు.

# అవినీతిపై మహోద్యమానికి శ్రీకారం

- గ్రామస్థాయి వరకు పోరుబాటకు లోక్‌సత్తా కార్యాచరణ

"మెజారిటీ ప్రజల కలల్ని, ఆకాంక్షల్ని సాంప్రదాయ రాజకీయ పార్టీలు (సా.రా పార్టీలు) కాలరాశాయి. యువత 21వ శతాబ్దపు అవకాశాల్ని అందుకుని దూసుకెళ్లాలని ఆరాటపడుతుంటే ఆ పార్టీలు 19వ శతాబ్దపు రాజకీయాన్ని చేస్తూ వారి ఆశల్ని చిదిమేస్తున్నాయి. ఆవగింజంత అభివృద్ధి- తాటికాయంత అవినీతితో రాష్ట్రాన్ని, దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్న సాంప్రదాయ పార్టీల సంకెళ్లను తెంచుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఆ రాజకీయం ఇక మనకి పనికిరాదు. అధికారాన్ని జిల్లా, మండల, పట్టణ, గ్రామస్థాయికి వికేంద్రీకరించి జనం చేతికి అధికారాన్నిచ్చి, అవినీతికి పాల్పడ్డవారు ఎంతటివారైనా శిక్షించి ఆస్తులు జప్తు చేసి, హేతుబద్ధమైన పారిశ్రామిక విధానంతో, లాభసాటి వ్యవసాయ విధానంతో అభివృద్ధిని సాధించే కొత్త అభివృద్ధి నమూనాను తేవటం, నేతల పిల్లలు, కోటీశ్వరులకే పరిమితమైన రాజకీయాన్ని ఛేదించి సామాన్యులు సైతం ప్రవేశించి ప్రజాస్వామ్యాన్ని వికసింపచేసే ప్రత్యామ్నాయ రాజకీయాన్ని తీసుకురావటం ఈవేళ్టి తక్షణావసరం. ఈ చారిత్రక అవసరానికి లోక్‌సత్తా ఓ వేదిక. దీన్ని సాధించే క్రమం అంత తేలిక్కాదు. అవినీతిపరులు మౌనంగా మనకు దారి ఇస్తారనుకోవద్దు. మన గొంతు నొక్కాలని అన్నిరకాలుగా ప్రయత్నిస్తారు. గాంధీనే హత్య చేసిన దేశం ఇది. కానీ ఎన్ని అవరోధాలచ్చినా ఈ బాధ్యతను మనం తీసుకోకతప్పదు. సత్యం ఎప్పటికైనా జయిస్తుంది కాబట్టి మన బాటే అన్ని పార్టీల బాట అవుతుంది, అంతిమంగా భారతదేశానికి భవిష్యబాట అవుతుంది. ప్రత్యామ్నాయ రాజకీయ నిర్మాణం, కొత్త అభివృద్ధి నమూనాను అమలు చేయటం ఎజెండాగా ఎన్ని అవరోధాలైనా వెరవకుండా మన పోరాటాన్ని గ్రామస్థాయి వరకూ తీసుకెళ్లేందుకు నాయకత్వ బాధ్యతలు తీసుకోండి".

ఈవేళ చాలామంది సాంప్రదాయ నేతలు తమ భవిష్యత్తు గురించి, తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించుకుంటున్నారు తప్ప దేశం గురించి, ప్రజల గురించి పట్టించుకోవటం మానేశారు. ఉన్నత లక్ష్యం, సరైన దిశ లేకుండా వ్యతిరేక, తిరోగమన రాజకీయాలకు పాల్పడుతున్నారు. అందుకోసం ద్వేషాన్ని పెంచుతూ సమాజాన్ని ముక్కలు చేస్తున్నారు. ఎన్నికలప్పుడు తప్ప ప్రజలు, ఆర్థిక వ్యవస్థ గురించి వారికసలు పట్టింపే లేదు. ఆ పార్టీలకు భిన్నంగా దేశ ఉజ్వల భవిష్యత్తు గురించి ఆలోచించే వారికి లోక్‌సత్తా ఒక వేదికగా పోరాడుతోంది.

తమ కపట, తప్పుడు విధానాలతో వివిధ రాజకీయపార్టీలు అభివృద్ధిని, ప్రగతిని ఎలా దెబ్బతీస్తున్నాయో జేపీ సవివరంగా పేర్కొన్నారు. వ్యవసాయానికి అనుకూలమని, రైతులకు అనుకూలమని చాటుకోవటంలో అన్ని పార్టీలూ పోటీపడుతున్నాయి. కానీ ఆచరణలో రైతు వెన్నువిరిచే రీతిలో వ్యవహరిస్తున్నాయి. 16మిలియన్ల ఆహారధాన్యాల నిల్వలు ఉంటేచాలని హేతుబద్ధ లెక్కలు చెబుతుంటే, మన గోదాముల్లో 50మిలియన్ టన్నుల ఆహారధాన్యాల నిల్వలు మూలుగుతున్నాయి. అందులో కొంత ముక్కిపోయాయి. వర్షాలు బాగా కురిసి దేశానికి మంచి పంట చేతికొస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఎగుమతులకు అనుమతి ఇవ్వకుండా, రైతుకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రాల్లో పామాయిల్ రైతుల్ని దెబ్బతీసేలా పన్నులేకుండా పామాయిల్ దిగుమతికి అనుమతిచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం తక్షణం ఫలితాలనిచ్చే ప్రాజెక్టుల్ని వదిలేసి అవినీతి ప్రయోజనాల కోసం ఆచరణసాధ్యంకాని ప్రాజెక్టులకు అనుమతినిచ్చింది. ఒక్క మట్టిపెళ్ల తీయకుండా, ఒక్క ఎకరాకు సాగునీరు ఇవ్వకుండానే ప్రాజెక్టు నివేదిక పేరుతో ఒక ఆచరణసాధ్యంకాని, భారీ ఎత్తిపోతల పథకానికి రూ.1000కోట్లు చెల్లించింది. హైదరాబాద్‌కతాగునీటి అవసరాలకు దగ్గరలో ఉన్న కృష్ణానది నుంచి మూడోదశ ప్రాజెక్టును చేపట్టకుండా అత్యంత భారీవ్యయంతో గోదావరి జలాల్ని తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. పోలవరం చేపట్టి గోదావరి నీళ్లను కృష్ణాకు మళ్లించి, నాగార్జునసాగర్ నుంచి కృష్ణానీటిని ఒక్క చుక్క కూడా కిందికి ఇవ్వకుండా తెలంగాణ, రాయలసీమకు మళ్లించే ఏర్పాటు చేసే దిశగా చేయాల్సిన కృషిని విస్మరించి దాన్నో రాజకీయ సమస్యగా మార్చి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారు. 2009లో కృష్ణానది వరదల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో ఇప్పటికీ పునరావాస చర్యలు జరగలేదు. కృష్ణా, దాని ఉపనదుల వరద కట్టలు ఇప్పటికీ దెబ్బతిన్న స్థితిలోనే ఉన్నాయి.

వ్యవసాయంలో నష్టాలు పెరిగిపోతుండటంతో గ్రామీణ యువత పొట్టచేత పట్టుకుని పట్టణ ప్రాంతాలకు తరలివస్తున్నా, చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి వాటిని ఆర్థిక, ఉపాధి కేంద్రాలుగా తీర్చిదిద్ది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించటంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి.

రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ తమ స్వార్థ ప్రయోజనాలకు తప్ప ప్రజల కోసం పనికొచ్చే విధానాలను పాటించటం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రావసరానికి మూడు

రెట్లు అంటే 50,000 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి లక్ష్యం పెట్టుకోవటం వెనక 'అక్రమ డబ్బును ఉత్పత్తి చేయటం తప్ప విద్యుత్‌ను ఉత్పత్తి చేయటం లక్ష్యం కాదు'.

దేశం అభివృద్ధి చెంది లక్షలాది యువతకు ఉపాధి లభించాలంటే దేశంలో విద్యుదుత్పత్తి, పారిశ్రామికీకరణ, మైనింగ్ తప్పనిసరి. అయితే అధికార, ప్రతిపక్షంలో ఉన్న సాంప్రదాయ పార్టీలు చెబుతున్న రీతిలో కాదు. "వీటన్నిటినీ మనం హేతుబద్ధ, పారదర్శక, అవినీతికి ఆస్కారంలేని విధానాలతో సాధించగలం. భూమిని ఇచ్చే యజమానుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, పర్యావరణానికి హాని చేయని రీతిలో చేయగలం. అయినా చాలా రాజకీయ పార్టీలు దేశప్రయోజనాలను పట్టించుకోకుండా తమ తక్షణ స్వప్రయోజనాల కోసం నెగెటివ్ రాజకీయాలకు పాల్పడుతున్నాయి".

కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో ఆందోళనలకు దిగటం ద్వారా, అవినీతికి పాల్పడటం ద్వారా రాజకీయ పార్టీలు శాంతికి, అభివృద్ధికి, ప్రగతికి ప్రతిబంధకాలుగా మారాయి.

కూలిపోతున్నా సాంప్రదాయ రాజకీయపార్టీలు ఎన్నో అవరోధాలు కల్పిస్తాయి. అందుకు సిద్ధపడే దేశాన్ని గట్టెక్కించి స్థిరమైన అభివృద్ధి బాటలోకి తెచ్చి, అందరికీ ఎదిగే అవకాశాల్ని కల్పించే రాజకీయ వ్యవస్థను నిర్మించేందుకు ఒక వేదికగా లోక్‌సత్తా తన పోరాటాన్ని కొనసాగించాలి.

రాజకీయాల్లో అవినీతి విశృంఖలమైనా చర్యలు కరవయ్యాయి. సుమారు లక్షకోట్లతో ప్రపంచ చరిత్రలోనే అతిభారీ స్కాంగా ఉన్న 2జీ స్పెక్ట్రం కుంభకోణంలో వంత పాడిన వ్యక్తిని కేంద్ర విజిలెన్స్ కమిషనర్‌గా నియమించిన దుష్పరిపాలన నడుస్తోంది. అవినీతిపై మహోద్యమానికి తక్షణం శ్రీకారం చుట్టాలి. ప్రధానమంత్రి నుంచి బంట్రోతు వరకు ఎవరు అవినీతికి పాల్పడ్డా ఆస్తుల్ని జప్తు చేసి కటకటాల పాలు చేసే అవినీతి నిరోధక కమిషన్‌ను రాష్ట్ర, దేశ స్థాయిలో సాధించేందుకు లోక్‌సత్తా పోరాడుతుంది. ఇందుకోసం ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చేందుకు గ్రామస్థాయి వరకు ప్రజల్లో ఉద్యమం చేయాలి. అత్యున్నత న్యాయవ్యవస్థలో కూడా అవినీతి వ్యాపించిన తర్వాత దేశాన్ని కలిపివుంచే వ్యవస్థలు కరవయ్యే ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్ల అత్యుత్తమ, నిజాయితీపరులైన వ్యక్తులు న్యాయవ్యవస్థలో ఉండేలా నియామకాలు జరిపేందుకు జాతీయ జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసేందుకు పోరాడాలి. కేంద్రీకృత పాలనావ్యవస్థను ఛేదించి స్థానిక ప్రభుత్వాలకు అధికారాన్ని వికేంద్రీకరించటంతో పాటు తలసరి రూ.1000 చొప్పున పౌరులకు నేరుగా బడ్జెట్‌లో కేటాయింపులు చేసి జనం చేతికి అధికారాన్ని ఇచ్చేందుకు లోక్‌సత్తా పోరాటాన్ని చేస్తుంది.

### కొన్ని ప్రధాన తీర్మానాలు

ప్రత్యామ్నాయ రాజకీయం, కొత్త అభివృద్ధి నమూనాతో జేపీ ప్రకటించిన భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలోని వివిధ అంశాలపై తీర్మానాలను డి.వి.వి.ఎస్ వర్మ ప్రవేశపెట్టారు. రాజకీయ, సంస్థాగత, భవిష్యత్ కార్యాచరణ తీర్మానాలను చర్చిస్తున్న మూడు బృందాలనూ పార్టీ నేతలు వై.డి రామారావు, కటారి శ్రీనివాసరావు, వి. లక్ష్మణ్ బాలాజీ, వి. విజయేందర్ రెడ్డి, పి. రవిమారుత్ పర్యవేక్షించారు. తీర్మానాలను బృందాలవారీగా చర్చించిన అనంతరం లోక్‌సత్తా నేతలు ఆమోదించారు. కొత్త అభివృద్ధి నమూనాలోని అంశాలపై పార్టీని గ్రామస్థాయి వరకూ తనదైన కొత్తరాజకీయ సంస్కృతితో ఉద్యమబాట పట్టించి ప్రజాపునాదిగల పార్టీగా తీర్చిదిద్దాలని తీర్మానించారు.

ప్రజల ఆశల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు సాంప్రదాయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా కొత్త వేదికను నిర్మించేందుకు భావసారూప్యంగల పార్టీలన్నీ కలిసిరావాలని లోక్‌సత్తా పార్టీ 'నాయకత్వ సదస్సు' ఈ సందర్భంగా రాజకీయ తీర్మానాన్ని ఆమోదించింది. హేతుబద్ధత, నైతికత, జాతీయత, లౌకికవాదం, ప్రజాస్వామ్య దృక్పథం అనే పంచసూత్రాలను అందుకు ప్రాతిపదికగా పేర్కొంది.

అవినీతిపై మహోద్యమానికి విద్యార్థుల నుంచి అన్నివర్గాల ప్రజలూ కలిసికట్టుగా పోరాడాలని పార్టీ మరో తీర్మానంలో కోరింది. ఇందుకోసం చేసే బహుముఖ పోరాటంలో భాగంగా నవంబర్ నుంచి ప్రజల్ని సమీకరించటానికి కార్యాచరణను ఖరారు చేసింది. మద్యనియంత్రణకు స్థానిక ఉద్యమాలను చేయాలని, పట్టణ ప్రాంతాలలో స్థానిక సమస్యల మీద, గ్రామప్రాంతాలలో పేదలు, రైతులు, యువత సమస్యల మీద పోరాడాలని లోక్‌సత్తా పార్టీ 'నాయకత్వ సదస్సు' తీర్మానాలు చేసింది. ◆

## లోక్‌సత్తా పార్టీ సభ్యులకు విజ్ఞప్తి

★ లోక్‌సత్తా పార్టీ భావజాలాన్ని కార్యకలాపాలను సామాన్య ప్రజలకు చేరువగా తీసుకువెళ్ళే ముఖ్య సాధనంగా వెలువడుతున్న 'లోక్‌సత్తా టైమ్స్' పక్ష పత్రికను ప్రజా బాహుళ్యంలోకి తీసుకువెళ్ళడంలో మీ పాత్ర ఎంతో ముఖ్యమైనది.

★ మీలో ప్రతీ ఒక్కరూ, ప్రతీనెలా కనీసం 5గురు చందాదారులను చేర్పించవలసినదిగా మనవి.

★ మీ సలహాలు, సహాయ సహకారాలు పత్రిక అభ్యున్నతికి, తద్వారా పార్టీ పురోగతికి తోడ్పడతాయని మరువవద్దు.

## ఎమ్మార్‌లో విల్లాలు కొన్న పెద్దలు పెదవి విప్పాలి: లోక్‌సత్తా

ఎమ్మార్ ప్రాపర్టీస్ భూముల వ్యవహారంలో అధికార దుర్వినియోగం, పైకి డబ్బు కనపడకుండా ఖరీదైన ఆస్తులు చేతులు మారినట్టు స్పష్టంగా కనపడుతున్నా, కామన్వెల్త్ క్రీడల్లో సైతం ఆ సంస్థ భారీ అవినీతికి పాల్పడినట్టు తెలుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించటం దారుణం. వెంటనే ఎమ్మార్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి. ఎమ్మార్‌పై ఉన్నత స్థాయి విచారణ జరుగుతుందని, కనీసం కొంతమేరకైనా అవినీతిపరులకు శిక్ష పడి దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. అవినీతిని చట్టబద్ధం చేసేసిన రీతిలో సర్కారు వ్యవహరిస్తోంది. మార్కెట్ రేటు కన్నా పది, పన్నెండు రెట్లు తక్కువ ధరకు విల్లాల స్థలాల్ని అమ్మినట్టు ఎమ్మార్ బహిరంగ తప్పుడు లెక్కలు చెబుతోంది. విల్లాలు కొనుగోలు చేసినవారిలో రాజకీయరంగంలోనివారితో సహా సమాజంలో వివిధ రంగాలలో బాధ్యతాయుతమైన వ్యక్తులున్నట్టు విశ్వసనీయ వార్తలు తెలియచేస్తున్నాయి. విస్తృత ప్రజాప్రయోజనాల దృష్ట్యా అక్కడ స్థలాలు కొన్న పెద్దలైనా పెదవి విప్పి తాము ఎంత ధరకు అక్కడ స్థలాలు కొన్నారో ప్రజలకు చెప్పి ప్రజాధనం లూటీకి పాల్పడ్డవారి ఆటకట్టించేందుకు తోడ్పడాలి.

ఎమ్మార్ అక్రమాలపై ప్రాథమిక విచారణ జరిపిన సంస్థలు ఇచ్చిన నివేదిక ఆధారంగా వెంటనే అవినీతి నిరోధక చట్టం కింద రాష్ట్రప్రభుత్వం విచారణ ప్రారంభించి ఉంటే, తీగ లాగితే డొంక కదిలినట్టు నల్లడబ్బు బైటపడి అక్రమార్కులు బైటికొచ్చేవారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన సర్వాధికారాలను ఉపయోగించి అవినీతి నిరోధక చట్టం కింద ఎమ్మార్ అక్రమాలపై విచారణ జరపాలి. ప్రభుత్వాధికారులు, నేతల గుట్టును బైటపెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి. నిందితులు ఎమ్మెల్యేలైతే వారి మీద విచారణ చేపట్టి నేరం రుజువైతే వారి ఆస్తుల జప్తునకు వీలుగా అవినీతి నిరోధక చట్టాన్ని సవరించాలి. ప్రభుత్వమే స్వయంగా రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారి ఏపీఐఐసీని అడ్డంపెట్టి ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు లబ్ధి చేకూర్చే కార్యక్రమాన్ని చేపట్టి ఇప్పుడు ఏపీఐఐసీయే ఎమ్మార్ అక్రమాలను నిగ్గు తేలుస్తుందని చేతులు దులుపుకోవటం తగదు. ఎమ్మార్ స్కాంలో దోషులైన అధికారుల, నేతల గుట్టు బైటపెట్టి తగు చర్యలు తీసుకోకపోతే ప్రజాకోర్టులో భారీ మూల్యం చెల్లించే రోజు వస్తుంది.◆

## గ్రామ న్యాయాలయాలతోనే సత్వర న్యాయం : లోక్‌సత్తా

- **హైకోర్టు బెంచ్ డిమాండ్ సహేతుకమే...**

ఏ స్థాయిలో వికేంద్రీకరణనైనా స్వాగతించాల్సిందేనని, ఆ దృష్ట్యా గుంటూరు-విజయవాడ మధ్య హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ సహేతుకమైనదే. అయితే అందుకోసం అక్కడి బార్‌అసోసియేష్లన్ల న్యాయవాదులు విధులు బహిష్కరించి ఆందోళన చేయటం తగదు. ప్రజలకు న్యాయం అందించటం కోసమే బెంచ్ ఏర్పాటుకు ఓపక్క ఆందోళన చేస్తూ మరోపక్క విధుల బహిష్కరణ ద్వారా అదే ప్రజలకు ఇబ్బందులు కలిగించటం సరికాదు.

"త్వరగా పనులు జరిగి ప్రజలకు సేవలు సక్రమంగా అందటం కోసం పాలనా వికేంద్రీకరణ కీలకమనటంలో సందేహం లేదు. అందువల్లే మనదేశంలోని కొన్ని రాష్ట్రాలలో హైకోర్టు బెంచ్ మాత్రమే కాకుండా కీలక ప్రభుత్వ కార్యాలయాలు కూడా రాజధానికి బైట ఏర్పాటయ్యాయి. మధ్యప్రదేశ్‌లో రాజధాని భోపాల్‌లోనే కాకుండా ఇండోర్, గ్వాలియర్‌లో కూడా కార్యాలయాలున్నాయి. మహారాష్ట్రలో నాగపూర్, పూనేలో ఉన్నాయి. అలహాబాద్ హైకోర్టు బెంచ్ లక్నోలో ఉంది. అయితే ఇది పరిమితస్థాయి వికేంద్రీకరణ మాత్రమే". హైకోర్టు బెంచ్‌ను గుంటూరు ప్రాంతంలోనో, మరోచోటో ఏర్పాటుచేయటం వల్ల న్యాయసేవలు కొంతమేర మెరుగవుతాయి. 90శాతం కేసులు గ్రామాల్లో, దిగువస్థాయిలోనే ఉంటాయి కాబట్టి గ్రామన్యాయాలయాల్ని (స్థానిక కోర్టుల్ని) ఏర్పాటు చేయటం వల్లే సామాన్య పజలకు ఎక్కువ మేలు జరుగుతుంది.

దేశవ్యాప్తంగా గ్రామన్యాయాలయాల ఏర్పాటుకు రూ. 1400కోట్లు కేటాయిస్తున్నామని, రాష్ట్రాల్లో గ్రామన్యాయాలయాల ఏర్పాటు మొత్తం పెట్టుబడి వ్యయాన్ని భరిస్తామని, కోర్టుల నిర్వహణ ఖర్చులో కూడా చాలాభాగం తిరిగి చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి, ప్రతిపాదనల్ని ఆహ్వానించి ఆరునెలలవుతున్నా ఇప్పటివరకూ మన రాష్ట్రప్రభుత్వం ఆ దిశగా స్పందించలేదు.. ఒక్కో స్థానిక కోర్టు ఏర్పాటుకు రూ. 18లక్షలు, ఏటా నిర్వహణకు రూ. 6.4లక్షలు అవుతుంది. ఈ విషయాలన్నిటినీ వివరిస్తూ స్థానిక కోర్టుల ఏర్పాటుకు తక్షణం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. ఏప్రిల్‌లో ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఇంతవరకూ స్పందన లేదు. పేదలకు సత్వరం, తక్కువ ఖర్చుతో న్యాయం అందుబాటులోకి తెచ్చేందుకు స్థానిక కోర్టుల ఏర్పాటు కోసం న్యాయవాదులు, పౌరసమాజం, రాజకీయ పక్షాలు రాష్ట్రప్రభుత్వం మీద తొలుత ఒత్తిడి తేవాల్సి ఉంది. ◆

# మైక్రోఫైనాన్స్ పై కఠినంగా వ్యవహరించాలి: లోక్‌సత్తా

- 'వడ్డీ'ని వదిలేసిన ఆర్డినెన్స్
- రాష్ట్రంలోని మైక్రో ఫైనాన్స్ పూర్తిగా తప్పుడు నమూనా
- మద్యనియంత్రణకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి: జేపీ

***మైక్రోఫైనాన్స్ సంస్థల కట్టడికి రాష్ట్రప్రభుత్వం శుక్రవారం జారీ చేసిన ఆర్డినెన్స్ అసలైన అంశం వడ్డీ నియంత్రణను విస్మరించింది. వడ్డీ మీద ఖచ్చితంగా పరిమితి ఉండాల్సింది.. ఒక పరిధి దాటి వడ్డీ వసూలు చేసే అవకాశం లేకుండా కఠిన ఏర్పాట్లు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దాంతోపాటు ఇంటికెళ్లి బాకీ వసూళ్లు చేసే పద్ధతి స్థానంలో పంచాయతీ ఆఫీసులో ఆ కార్యక్రమాన్ని నిర్వహించే ఏర్పాటు ఉండాలి. ఒకటి కంటే ఎక్కువ రుణాలు తీసుకునే అవకాశం లేకుండా కట్టడి చేసేందుకు ఒక నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలి. వీటన్నిటి మీదా అసెంబ్లీలో లోక్‌సత్తా గట్టిగా గళం విన్పిస్తుంది. ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచుతుంది. ఎస్‌హెచ్‌జీలకు మళ్లీ రుణం ఇవ్వాలంటే డీఆర్‌డీఏ పీడీ, 'మెప్మా' పీడీ నుంచి ఎంఎఫ్ఐలు ముందుగా ఆమోదం తీసుకోవాలి. ఆర్డినెన్స్‌లో పొందుపరిచిన నిబంధనను స్వాగతిస్తున్నాం.***

మన రాష్ట్రంలోని మైక్రో ఫైనాన్స్ వ్యవస్థ పూర్తిగా తప్పుడు నమూనా అని, సూక్ష్మ రుణ సంస్థలు పేదరికం పోగొట్టటానికి కాకుండా పేదల నుంచి డబ్బు గుంజటానికి మైక్రో ఫైనాన్స్‌ను ఓ వ్యాపారమార్గంగా చేసుకున్నాయి. బంగ్లాదేశ్‌లో మహ్మద్ యూనస్ ఏర్పాటు చేసిన సూక్ష్మరుణ వ్యవస్థను తాను 2006లో జేపీ స్వయంగా పరిశీలించారు. ఆయన అంతర్జాతీయ సమాజం నుంచి తక్కువ వడ్డీకి నిధుల్ని లేదా గ్రాంటుల్ని తెచ్చి బంగ్లాదేశ్‌లోని నిరుపేదలకు నామమాత్రపు వడ్డీకి అందించి పేదరికం నుంచి వారిని బైటపడేసేందుకు సూక్ష్మ రుణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అలాగే గతంలో మన రాష్ట్రంలో కూడా పొదుపును బృందాల నుంచే సేకరించి, వాళ్లకే తక్కువ వడ్డీకి ఒక్కో అవసరానికి ఒక్కో రేటుతో అప్పులిచ్చి, వచ్చిన లాభాలను తిరిగి ఆ బృందాలలోని సభ్యులకే పంచే ఆరోగ్యకరమైన సహకార రుణ వ్యవస్థ ప్రయత్నం జరిగింది. అయితే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించిన మైక్రో ఫైనాన్స్ విధానం ఆ రెంటికీ పూర్తి భిన్నంగా రాష్ట్రంలోని పేదల్ని పీల్చిపిప్పిచేసే భయంకర వ్యాపారంగా మారింది.

బ్యాంకుల నుంచి సాధారణ వడ్డీకి తెచ్చిన సొమ్మును పేదలకు అప్పులిచ్చి ఖరీదైన ఎగ్జిక్యూటివ్‌లు, ఇతర హంగుల నిర్వహణ ఖర్చులతో కలుపుకుని 40-50శాతం వడ్డీని వసూలు చేస్తున్నారు. గత పదేళ్లలో సగటున రూ. 5,000కోట్ల లావాదేవీలు చేసిన ఈ మైక్రో ఫైనాన్స్ సంస్థలు రాష్ట్రంలోని పేదల నుంచి వడ్డీ రూపంలో కనీసం రూ. 20,000కోట్లు వసూలు చేశాయంటే పేదల్ని ఏ తీరుగా పీలుస్తున్నారో అర్థమవుతుంది. వారంవారం డబ్బు వసూలు చేసే పద్ధతి వల్ల నెలసరి జీతాల మీద ఆధారపడే డబ్బు రొటేషన్ లేక విలవిలలాడిపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సూక్ష్మరుణ వ్యవస్థ స్థానికంగా తక్కువ వడ్డీతో, తక్కువ ఖర్చుతో స్థానికంగా ఉండే ప్రజలే నిర్వహించుకునే రీతిలో కాకుండా దోపిడీకి మార్గంకావటానికి ప్రభుత్వ విధానాలే ప్రధాన కారణం. పొదుపును ప్రోత్సహించి, పరపతి విధానాన్ని విస్తరించకుండా ప్రజల్ని కేవలం ఓటుబ్యాంకులుగా భావించే విధానాలను ప్రభుత్వాలు అమలుచేస్తుండటం వల్లే ఈ దారుణ పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని విచ్చలవిడిగా చేయటం వల్ల వారు తమ ఆదాయాన్ని మద్యానికి తగలేస్తూ అవసరాల కోసం రుణవ్యాపారుల వలలో చిక్కుకుంటున్నారు. రాష్ట్రంలో మద్యానికి పేదలు తాగుడుకి రూ. 20,000కోట్లు ఖర్చు చేస్తుంటే, సూక్ష్మ రుణ సంస్థలు ఇస్తున్న అప్పులు కేవలం రూ. 5,000-6,000కోట్లు మాత్రమే.

"ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకొని ఒక బలమైన చట్టాన్ని తెచ్చి హెచ్చువడ్డీల్ని నిషేధించి, మైక్రో ఫైనాన్స్ సంస్థల దౌర్జన్యాల్ని అరికట్టాలి. చట్టం ఉన్నా పేదరికం దృష్ట్యా ఎంత వడ్డీకైనా అప్పు తీసుకోవాల్సిన పేదల పరిస్థితిని ఆసరాగా తీసుకుని దోపిడీ ఏదోకరూపంలో కొనసాగుతుందికాబట్టి, వెంటనే పరపతి విధానాన్ని బలోపేతం చేసేందుకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి. మద్యాన్ని కఠినంగా నియంత్రించి పొదుపును ప్రోత్సహించే పథకాలను ప్రవేశపెట్టాలి. 2008లో రుణమాఫీ పేరుతో రూ. 73,000కోట్లు వృధాగా వెదజల్లి గ్రామీణ ప్రాంతాల్లో పరపతిని దెబ్బతీసిన కేంద్రప్రభుత్వం ఆ తప్పిదాన్ని సరిదిద్దుకుని సాధారణ వడ్డీతో రుణసదుపాయానికి రూ. లక్షకోట్లతో శాశ్వత నిధిని ఏర్పాటుచేయాలి". ◆

# రైతులకై రాజకీయాలకతీతంగా పోరాడదాం

**మన రైతులకు లాభం వచ్చేలా బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముకోనివ్వటం లేదు. మన రైతులకు నష్టం వచ్చేలా పామాయిల్‌ను మాత్రం స్వేచ్ఛగా దిగుమతి చేసుకుంటున్నారు. మసూరి బియ్యం ఎగుమతికి ఇప్పుడు అనుమతిస్తే రైతుకు రూ.80,000కోట్లు దాకా లాభం. "మసూరి, ఇతర రకాల బియ్యం ఎగుమతికి వెంటనే అనుమతి ఇవ్వాలి. పామాయిల్ దిగుమతిపై 60శాతం సుంకం వేసి రైతులకు మద్దతు ధర పెంచాలి. ఆహార నిల్వల్ని పీడీఎస్ ద్వారా పేదలకు పంచి ధరల్ని నియంత్రించాలి". వ్యవసాయాన్ని దారుణంగా దెబ్బతీస్తున్న విధానాలపై సమిష్టిగా పోరాడి ఢిల్లీని కదిలించి పరిష్కారం సాధిద్దామని రాష్ట్రంలోని రాజకీయ పార్టీలకూ, రైతుసంఘాలకూ లోక్‌సత్తా విజ్ఞప్తి.**

కేంద్ర ప్రభుత్వ నేరసమాన నిర్లక్ష్యంతో అనుసరిస్తున్న అపసవ్య, అసంబద్ధ విధానాల వల్ల, రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేయటం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో అనేక రెట్లు డిమాండ్ ఉన్నా మన వరి రైతులు బియ్యం అమ్ముకునేందుకు అవకాశం లేకుండా పోయింది. మరోవైపు సుంకంలేకుండా విదేశాల నుంచి స్వేచ్ఛగా దిగుమతి అవుతున్న పామోలిన్ వల్ల రాష్ట్రంలోని పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర లేకుండా పోయింది. ఎగుమతి, దిగుమతుల్లో ఎటుచూసినా రైతుల్ని తీవ్రంగా దెబ్బతీస్తున్న ప్రభుత్వ విధానాలపై సమిష్టిగా పోరాడి, రైతులకు మేలు చేసే పరిష్కారాన్ని సాధించాలి.

బియ్యం ఎగుమతులకు అనుమతినివ్వకుండా, పామాయిల్‌కు కస్టమ్స్ సుంకం లేకుండా అనుమతినివ్వటం ద్వారా కేంద్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. రాష్ట్రప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేయటంతో రుతుపవనాల వల్ల పంటలు బాగా పండినా కూడా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

ఖరీఫ్ ధాన్యం దిగుబడి వస్తున్న వేళ రైతుల దయనీయ స్థితిని కళ్లకు కట్టేలా జేపీ గణాంకసహితంగా వాస్తవాలను వివరించారు. "భారతదేశంలో ఈవేళ 4.6కోట్ల టన్నుల బియ్యం, ధాన్యం, గోధుమలు బఫర్ నిల్వలుగా ఉన్నాయి. అద్దెకు తీసుకున్న గోదాములతో సహా ఎఫ్.సి.ఐ నిల్వ సామర్థ్యం 2కోట్ల 73 లక్షల టన్నులు మాత్రమే కాబట్టి మిగిలిన ఆహారధాన్యాలన్నీ ఆరుబైటే ఉంచక తప్పదు. బైట వానలకు దెబ్బతింటూ, ఎలుకలు, పందికొక్కులకు ఆహారమవుతూ వృథా అవుతుంటాయి. జులై మాసంలో దేశం మొత్తంలో ఆహారధాన్యాలు 2కోట్ల 70లక్షల టన్నులు ఉండాల్సి ఉండగా ఆ మొత్తం అక్టోబర్‌లో 1కోటీ 60లక్షల టన్నులుగా ఉండాలి. అవికాక సాగువిస్తీర్ణం పెరిగి వర్షాలు బాగా పడటంతో ఈసారి భారీగా బియ్యం దిగుబడి వస్తుంది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, ఎఫ్.పి.ఐకి 38లక్షల టన్నుల స్టోరేజి సామర్థ్యం ఉండగా, బియ్యం సేకరణ లక్ష్యం 67లక్షల టన్నులుగా ఉంది".

పంట రాకముందే గోదాముల్లో నిల్వలు మితిమీరి ఉండటంతో, ధాన్యం ధరలు కనీస మద్దతు ధరకంటే భారీగా పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. రైతును రక్షించటానికి వెంటనే ఎగుమతులకు అనుమతించాలి. అంతర్జాతీయ మార్కెట్‌లో



మసూరి బియ్యం ధర కిలోకు రూ.70 నుంచి రూ.90 వరకూ ఉండగా, ఎగుమతి అనుమతులు లేక మన రైతులు ఉస్సురంటున్నారన్నారు. "పదవ తరగతి విద్యార్థికి కూడా అర్థమయ్యే లెక్కలివి. అయినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదంటే రైతుల్ని, వ్యవసాయాన్ని నాశనం చేయాలని కంకణం కట్టుకుని వ్యవహరిస్తున్నట్టుంది".

బియ్యం ఎగుమతులను అనుమతించటం వల్ల ఆహార ధాన్యాల ధరలు పెరుగుతాయని ప్రభుత్వం ఆందోళన చెందాల్సిన పన్లేదు. ఈసారి భారీగా పంట దిగుబడి ఉండటం వల్ల ఆ భయం అనవసరం. ఎటువంటి ధరల పెరుగుదలనైనా ఎదుర్కొనేలా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయటానికి ప్రభుత్వం వద్ద భారీగా ఆహారధాన్యాల నిల్వలు ఉన్నాయి.

క్రికెట్ మ్యాచ్లల్లో, ఇతర వ్యాపకాల్లో మునిగిపోయిన కేంద్ర వ్యవసాయ మంత్రి, భారత ప్రభుత్వం జనవరిలో పరిస్థితిని సమీక్షిద్దామనుకుంటే అప్పటికి ఖరీఫ్ దిగుబడిని రైతులు అమ్మేసుకుంటారు. బియ్యం ఎగుమతులను ఇప్పుడు అనుమతిస్తే రైతులకు లాభం, అప్పుడు అనుమతినిస్తే వ్యాపారులు మాత్రమే లాభపడతారు. అంచనాలకు తగ్గట్టు ఖరీఫ్ బియ్యం దిగుబడి 8కోట్ల టన్నులుంటే, ఎగుమతుల వల్ల రైతులకు కిలోకు అదనంగా రూ.10 వచ్చినా రూ.50,000కోట్ల నుంచి రూ.80,000కోట్ల వరకూ అదనంగా ధర లభిస్తుంది.

భారత వ్యవసాయరంగానికి లాభం చేకూరుస్తుందంటూ 1990లకాలంలో భారత ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది.ప్రస్తుత ప్రధాని మన్మోహన్ సింగ్ అప్పట్లో ఆర్థికమంత్రిగా ఉన్నారు. భారత్లో అనేక వ్యవసాయోత్పత్తుల దిగుబడి వ్యయం తక్కువ కాబట్టి, ఎగుమతుల వల్ల మంచి లాభాలార్జించ వచ్చని అప్పట్లో మన రైతులకు ప్రభుత్వం పార్లమెంటులో అధికారికంగా ప్రకటించిందన్నారు. ఇతర దేశాల్లో చౌకగా ఉత్పత్తి అయ్యే వ్యవసాయోత్పత్తుల వల్ల మనం నష్టపోకుండా దిగుమతుల మీద 60నుంచి 130శాతం దాకా సుంకం విధించే ఏర్పాటు ఉందని భరోసా ఇచ్చింది. అప్పట్లో రైతులకు ఇచ్చిన అధికారిక హామీల్ని ఈవేళ పూర్తిగా విస్మరించి, బియ్యం ఎగుమతులకు అనుమతినివ్వకుండా అడ్డుకోవటం ద్వారా రైతులను శిక్షిస్తోంది.

పంచదార, పప్పులు తదితర ఇతర వ్యవసాయోత్పత్తులను ప్రభుత్వం దాదాపు 2కోట్ల టన్నుల మేర ప్రభుత్వం అసంబద్ధంగా దిగుమతి చేసుకుంటోంది. మలేషియా, ఇండొనేషియా తదితర దేశాల్లో చౌకగా ఉత్పత్తి అయ్యే పామాయిల్ను కస్టమ్స్ సుంకం ఎత్తేసి ఎటువంటి ఆంక్షలూ లేకుండా దిగుమతి చేసుకోవటం ద్వారా ప్రభుత్వం మనరాష్ట్రంలోని పామాయిల్ రైతుల పొట్ట కొడుతోంది. పామాయిల్ రైతులకు హామీ ఇచ్చినట్టు మద్దతు ధరను చెల్లించటంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి.

పామాయిల్పై దిగుమతి పన్నును కనీసం 60శాతం వరకూ విధించి ఆ డబ్బును రైతులకు మద్దతు ధరనివ్వటానికి (టన్నుకి రూ.8,000), ప్రజాపంపిణీ వ్యవస్థలో సబ్సిడీ ద్వారా పామాయిల్ను సరఫరా చేయటానికి వినియోగించాలి.

దేశంలో ఆహార ధాన్యాల నిల్వల సామర్థ్యాన్ని పెంచే పథకంలో ఆంధ్రప్రదేశ్కు సర్కారు నిర్లక్ష్యం వల్ల అన్యాయం జరిగింది. ప్రతిపాదిత 1కోటీ 28లక్షల అదనపు స్టోరేజీ కెపాసిటీలో ఆంధ్రప్రదేశ్కు కేవలం 1లక్ష టన్నుల స్టోరేజీ సామర్థ్యం మాత్రమే దక్కటం విచారకరం. దేశంలో ధాన్య భాండాగారంగా పేరొందిన ఆంధ్రప్రదేశ్కు అదనంగా 25లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం గోదాములు అవసరం. ◆

## ఎస్.ఐ రాతపరీక్షను ఈ ఏడాదిలోగానే నిర్వహించేలా చూడండి

## జేపీని కలిసి కోరిన అభ్యర్థులు

**2008, డి**సెంబర్ 30న విడుదలైన ఎస్.ఐ (సబ్ఇన్స్పెక్టర్)ల రిక్రూట్మెంట్ నోటిఫికేషన్కు ఇప్పటిదాకా రాతపరీక్ష నిర్వహించలేదని, రాత పరీక్షను ఈ సంవత్సరాంతంలోగా జరిపేలా తోడ్పాటునివ్వాలని రాష్ట్రంలోని అన్ని జోన్ల నుంచి వచ్చిన ఎస్.ఐ అభ్యర్థులు లోక్సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ను శుక్రవారం ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో కలుసుకుని వినతి పత్రం ఇచ్చారు. "2008, డిసెంబర్ 30న 1293 ఎస్.ఐ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఏదోక కారణం చెబుతూ ఆరుసార్లు దేహదారుఢ్య పరీక్షల్ని వాయిదా వేశారు. ఎట్టకేలకు 2010, ఆగస్టు 3న దేహదారుఢ్య పరీక్షల్ని పూర్తి చేశారు. కానీ రాతపరీక్ష తేదీని ఏదోక సాకుతో వాయిదా వేస్తున్నారు. హోంమంత్రిని, పీఆర్బీ ఛైర్మన్ను, హోంశాఖ కార్యదర్శిని కలిసినా స్పందన లేదు. మా ఆర్థిక ఇబ్బందులను కూడా దృష్టిలో పెట్టుకుని 2010లోగానే రాతపరీక్ష జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేందుకు తోడ్పాటు అందించవలసిందిగా కోరుతున్నాం" అని అభ్యర్థులు జేపీని కోరారు.

సమస్యను ముఖ్యమంత్రి, హోంమంత్రి, పీఆర్బీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్తానని, ఆలస్యంలేకుండా రాతపరీక్ష నిర్వహించేలా చూసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని జయప్రకాష్ నారాయణ్ ఎస్.ఐ అభ్యర్థులకు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# ఎస్.సి, ఎస్.టి. కమిషన్ ఛైర్మన్, సభ్యులను తక్షణం నియమించండి
# గవర్నర్‌ను ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞాపనను అందించిన లోక్‌సత్తా నేతలు

ఏడాదిన్నరగా ఖాళీగా ఉన్న రాష్ట్ర ఎస్.సి, ఎస్.టి కమిషన్‌కు ఛైర్మన్‌ను, సభ్యులను వెంటనే నియమించాలని లోక్‌సత్తా పార్టీ అనుబంధ ఎస్.సి, ఎస్.టి, ఓ.బి.సి, మైనారిటీల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక చైతన్య వేదిక 'సర్వజన సత్తా' రాష్ట్ర కన్వీనర్ ఈద చెన్నయ్య ఆధ్వర్యంలో వై. రమాదేవి, పి. హనుమంతరావు, వినోద్ యాదవ్, రాఘవయ్య, పి.వి.రావు, విజయ్ కిరణ్‌లతో కూడిన బృందం రాష్ట్ర గవర్నర్ ఈ.ఎస్.ఎల్. నరసింహన్‌ను రాజ్‌భవన్‌లో మరియు ముఖ్యమంత్రి రోశయ్యను ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి విజ్ఞాపన పత్రం అందచేశారు. ఎస్.సి, ఎస్.టిలపై వేధింపులు, అకృత్యాలు పెరిగిపోతున్నాయని అధికారిక లెక్కలే చెబుతున్నాయని, పూర్తిస్థాయి కమిషన్ కూడా లేకపోతే వాటికి అడ్డూఅదుపూ లేకుండా పోయి మెజారిటీ ప్రజలకు రాజ్యవ్యవస్థ పట్ల నమ్మకం పోయే ప్రమాదముందని వారు





## విజ్ఞాపనపత్రంలోని ప్రధాన డిమాండ్లు...

1) కమిషన్ నియామకంలో మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల చట్టం దుర్వినియోగమై కేసుల పరిష్కారంలో విపరీత జాప్యం జరుగుతోంది కాబట్టి రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా నిజాయతీ, సామర్థ్యం ఉన్నవారితో రాష్ట్ర ఎస్.సి, ఎస్.టి కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

2) కమిషన్‌లోని సభ్యులు రాజకీయేతర సామాజిక నేపథ్యం, న్యాయ పరిజ్ఞానం కలిగినవారై ఉండాలి

3) కమిషన్ పనితీరును మెరుగుపరిచేందుకు ఖాళీగా ఉన్న కార్యదర్శిని, ఖాళీగా ఉన్న పోస్టులను తగిన సిబ్బందితో భర్తీ చేయాలి. కమిషన్‌కు వచ్చే ఫిర్యాదులను బట్టి, చేయవలసిన పనిని బట్టి చూస్తే ఇప్పుడున్న సిబ్బందికి రెండింతల సంఖ్యలో సిబ్బంది కావాలి.

4) రాజ్యాంగం ద్వారా ఏర్పడిన జాతీయ ఎస్.సి, ఎస్.టి కమిషన్ తరహాలో రాష్ట్ర కమిషన్ పనితీరు, సిఫార్సులతో కూడిన రిపోర్టును ప్రతి సంవత్సరం రాష్ట్ర గవర్నర్ ద్వారా శాసనసభలో ప్రవేశపెట్టాలి

5) ఎస్.సి, ఎస్.టిల హక్కుల పరిరక్షణకు ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ చట్టం 9/2003లో పేర్కొన్నట్టు గ్రంథాలయం, పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలి

6) రాష్ట్ర ఎస్.సి, ఎస్.టి కమిషన్‌కు ఒక సమగ్రమైన వెబ్‌సైట్‌ను రూపొందించాలి

మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా గత 8 సంవత్సరాలుగా ఎస్.సి, ఎస్.టి కమిషన్‌లో నమోదైన కేసులు 23,773కాగా పరిష్కరించిన కేసులు కేవలం 19శాతం అంటే 4,360 మాత్రమేనని, కమిషన్ దృష్టికి రాకుండా రాజకీయ ఒత్తిడి వల్ల పోలీసు స్టేషన్లలో, జిల్లా అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న కేసులు కూడా ఇంకా పెద్దసంఖ్యలో ఉన్నాయి కాబట్టి ప్రభుత్వం కమిషన్‌ను పటిష్టం చేయటంతోపాటు అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు ఇతర సమగ్ర చర్యలు కూడా చేపట్టాలని సర్వజన సత్తా నేతలు విజ్ఞప్తి చేశారు.

గవర్నర్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ... తమ విజ్ఞప్తుల్ని గవర్నర్ సావధానంగా విన్నారని, కమిషన్‌లో సాధ్యమైనంత త్వరలో నియామకాలు జరిగేలా ప్రభుత్వాన్ని కోరతానని హామీ ఇచ్చారని సర్వజన సత్తా నేతలు తెలిపారు. ◆

# రాజకీయాలకు అతీతంగా రైతులు ఏకం కావాలి
# దీర్ఘకాలికంగా వ్యవసాయాన్ని లాభసాటి చేసుకోవాలి

## రైతులకు లోక్‌సత్తా పార్టీ విజ్ఞప్తి

ధాన్యం పంట రైతుల చేతికి రానుంది. కళ్లముందు ధాన్యం రాసులు కనిపిస్తున్నాయి. అమ్ముకునే దారి కనిపించడం లేదు. నిల్వ పెట్టుకునే స్థితి లేదు. పంటలు బాగా పండినప్పుడైనా రైతుల దిగులు తీరాలి. వారికి మిగులు తేలాలి. కాని అయినకాడికి అమ్ముకోవడం, అప్పుల పాలుకావడం రైతుల వంతు అవుతున్నది. న్యాయం, ధర్మం రైతుల పక్షాన వున్నా, ప్రతిసారీ వంచనకు గురౌతున్నారు. దీనికి ఎవరినో నిందించి లాభం లేదు. రైతులు వ్యవసాయదారులుగా ఏకం కాలేకపోతున్నారు. సమస్యలపై ఒక్కటై పోరాడలేక పోతున్నారు. ఈ అనైక్యతే రైతులు పాలిటశాపం అయింది. మనచుట్టూ వున్న ఉద్యోగ, కార్మిక సంఘాలను చూడండి. వ్యాపార వాణిజ్యరంగాలను చూడండి, డాక్టర్లనీ, లాయర్లనీ, ఉపాధ్యాయులనీ చూడండి వీరిలో ఎవరి రాజకీయాలు వారికి వున్నాయి. కాని తమ సమస్యల మీద అందరూ ఏకమై గొంతు విప్పుతున్నారు, ఉద్యమిస్తున్నారు. ప్రభుత్వాలు ఏవైనా రాజకీయాన్ని శాసించ గలుగుతున్నారు. అలాగే రైతులు కూడా కులాలకీ, రాజకీయాలకీ అతీతంగా ఒక్కటి కాగలిగితే, సమస్యలపై కలిసికట్టుగా స్పందించగలిగితే రైతుల చుట్టూ రాజకీయం తిరుగుతుంటుంది. లేకపోతే రైతులు రాజకీయానికి బలైపోతారు. పండించడమే కాని ఫలితం పొందలేని వారుగా మిగిలిపోతారు. ఇతర సంఘాలు చేస్తున్న విధంగా రైతులు కూడా సంఘటితం కావాలి. రైతులలో ఇలాంటి కొత్త చైతన్యాన్ని తీసుకురావాలన్న తలంపుతో డా॥ జయప్రకాష్ నారాయణ్ గారు గ్రామాలలో పర్యటిస్తున్నారు. ఇష్టాగోష్టి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎవరి రాజకీయాన్ని వారు వుంచుకోండి, కాని తక్షణ సమస్యల మీద రైతులంతా ఒక్కటేనన్న నినాదాన్ని వినిపించండి. రైతుల మధ్య అలాంటి ఐక్యత సాధించడానికి అందరూ సహకరించాలి.

**తక్షణ సమస్యలు :**

**1. ధాన్యం మద్ధతు ధర :** ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధర రైతులకు లాభసాటి కాదు. అందుచేత రాష్ట్రప్రభుత్వం మరో 200 రూపాయాలు బోనస్‌గా ప్రకటించాలి. రైతులకు కచ్చితంగా మద్ధతు ధర ఇచ్చేలా జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో రైతు ప్రతినిధులతో ఒక కమిటీని వేసి సక్రమంగా కొనుగోళ్ల డబ్బు చెల్లింపులు జరిగే ఏర్పాటు చెయ్యాలి.

**2. ఎగుమతులను అనుమతించాలి :** దేశానికి ఆహారభద్రత అత్యంత అవసరం, అలాగే పేదలకు చౌకగా బియ్యం అందించాలి. ఈ అవసరాలకు తగినంత బియ్యాన్ని ప్రభుత్వం సేకరించాలి. అంతకు మించి వున్న ఆహారధాన్యాల ఎగుమతుల పై ఎలాంటి నిషేధం వుండకూడదు. అలాగే రాష్ట్రాల మధ్య ఆహార ధాన్యాల ఎగుమతులకు ఆంక్షలు వుండకూడదు. అంతర్జాతీయ మార్కెట్‌లో బాగా ధరలు పలుకుతున్నప్పుడు ప్రభుత్వ సంస్థల ద్వారా ఎగుమతులు చేసి అదనంగా వచ్చిన లాభాన్ని రైతులకు అందించే ఏర్పాటు చెయ్యాలి.

**3. ఇతర పంటలు :** పామాయిల్‌తో సహా ఇతర నూనెలు, పంచదార వంటి ఆహార పదార్ధాల దిగుమతులపై విధిగా సుంకం విధించి ఆ ఆదాయాన్ని ఆ రైతులకు సబ్సీడీలుగా అందించాలి. కాలక్రమేణ దేశాన్ని స్వయం సమృద్ధం చేయాలి. ప్రత్తి లాంటి ఆహారేతర వాణిజ్య పంటల వాణిజ్యానికి ఎలాంటి అవరోధాలు లేకుండా దేశంలో, ప్రపంచంలో ఎక్కడ గిరాకీ వుంటే అక్కడ అమ్ముకునే అవకాశం వుండాలి.

**4. గోదాముల సమస్య :** ఇప్పటికే ప్రభుత్వ గోదాములు నిండుకుండల్లా వున్నాయి. ఈ నిల్వలను పేదలకు పంపిణీ ద్వారా, అంతర్జాతీయ – జాతీయ మార్కెట్‌లో అమ్మకం ద్వారా తక్షణం ఖాళీ చేయించాలి. రాష్ట్రంలో అదనంగా 30 లక్షల టన్నుల గోడౌన్ల నిర్మాణాన్ని చేపట్టాలి.

అలాగే రైతులు తమ ఇళ్ల వద్ద, ప్రయివేటు గోదాములలో నిల్వ చేసుకున్న వాటికి తాకట్టు రుణాలు ఇవ్వాలి. మార్కెట్ యార్డులలో కమ్యూనిటీ హాళ్ళు, ఇతర ప్రభుత్వ బిల్డింగ్‌లలో అవకాశం వున్న అన్ని చోట్ల రైతుల ధాన్యం నిల్వలకు అనుమతించి వాటికి 'తాకట్టు' రుణాలు ఇవ్వాలి.

**5. ఉపాధి హామీ వర్తింపు :** జాతీయ ఉపాధి హామీ పధకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చెయ్యాలి. 50 శాతం సొమ్మును రైతుల వ్యవసాయ పనులకు ఖర్చు చేయడానికి వీలుగా ఈ పధకాన్ని రూపొందించాలి. రైతులకు నేరుగా సబ్సీడీ ఇచ్చే పధకంలో ఒకటిగా దీనిని పరిగణించాలి.

ఈ సమస్యలపై వివిధ పార్టీలు నిర్వహించిన అఖిలపక్ష సమావేశాలలో దాదాపుగా ఏకాభిప్రాయం వుంది. అందుచేత రైతులు ఇప్పటికైనా రైతులుగా ఆలోచించాలి. రాజకీయ విభేదాలను పక్కన పెట్టాలి. కలిసి గొంతు విప్పాలి. రైతులంతా ధాన్యం సమస్యల మీద తక్షణం ఒక్కటి కాగలిగితే విజయం తధ్యం. అలాంటి ఐక్యతను ప్రదర్శించవలసిందిగా కోరుతున్నాం. ◆

అభివృద్ధిలో ఎస్సీ, ఎస్టీలది ఇంకా అట్టడుగు స్థానమే

# 'అంత్యోదయ'కు మనం ఆమడ దూరం

- డా॥ ఎనుగొండ నాగరాజనాయుడు

వర్తమాన ప్రపంచ చరిత్రలో 'మానవ వనరుల అభివృద్ధి' ఎనలేని ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటోంది. ఏ సమాజమైనా మానవ వనరుల వినియోగంలో సమగ్రాభివృద్ధిని సాధించాలంటే, ఆ నిర్దిష్ట సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకూ ప్రాథమికావసరాలయిన విద్య, వైద్యంతో సహా జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవడానికి అవసరమైన ఆదాయ వనరులు అందుబాటులోకి వచ్చినప్పుడే అది సాధ్యమవుతుంది. అమెరికా, యూరఫ్ దేశాలు మానవ వనరుల అభివృద్ధిపై 19వ శతాబ్దం నుంచే దృష్టి సారించి కృషి సాగిస్తున్నాయి.

భారతదేశం పరాయి పాలన నుంచి 20వ శతాబ్దంలో స్వాతంత్ర్యాన్ని సాధించి 63 సంవత్సరాలు గడిచి, 21వ శతాబ్దంలోకి అడుగు పెట్టినా, మానవ వనరుల అభివృద్ధిలో మనది నేటికీ అట్టడుగు స్థానం కావడం ఆందోళన కలిగించే అంశం. 2000 నుంచి 2005 వరకూ 177 దేశాలలో మానవ వనరుల అభివృద్ధిని విద్య, వైద్యం, జీవన ప్రమాణాల ప్రాతిపదికన అధ్యయనం చేసిన ప్రపంచ బ్యాంకు ఒక నివేదికను వెలువరించింది. దాని ప్రకారం, మానవ వనరుల అభివృద్ధిలో 2000 సంవత్సరంలో 124వ స్థానంలో ఉన్న భారతదేశం, 2005కు మరింత క్షీణించి 128వ స్థానానికి దిగజారింది. అదే నివేదికలోని లెక్కల ప్రకారం, చైనా 2000 సంవత్సరంలో 96వ స్థానంలో ఉండగా, 2005కు మరింత అభివృద్ధి చెంది 81వ స్థానానికి ఎగబాకడం గమనార్హం. దీని కొనసాగింపుగా ఇటీవల హార్వర్డ్ యూనివర్సిటీ ప్రత్యేక బృందం మన దేశం వచ్చి ఇక్కడి పేదరికాన్ని అధ్యయనం చేసింది. ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే భారత్‌లోనే పేదల సంఖ్య గణనీయంగా ఉందని ఆ బృందం ధ్రువీకరించడం మరింత ఆందోళన కలిగించే అంశం.

## నెరవేరని మహాత్ముని కల

స్వాతంత్ర్యం సాధించిన ప్రారంభదినాల్లో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ భారత ప్రజలంతా సుభిక్షంగా జీవించడానికి అనువయిన గ్రామ స్వరాజ్యం, సామ్యవాద సమాజం నిర్మిస్తామని పలికిన పలుకులు, 63 ఏళ్ల తరువాత శుష్క, వాగ్దానంగానే మిగిలిపోవడం దురదృష్టకరం. నేటికీ మన దేశ అక్షరాస్యత 66 శాతాన్ని మించకపోగా, అందరికీ నాణ్యమయిన వైద్యం గగనకుసుమంగానే మిగిలిపోయింది. దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనివిధంగా మేలయిన పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని ప్రణాళికా సంఘంతో పాటు మన ఏలికలు ప్రకటిస్తుంటారు. అయినా, అభివృద్ధి ఫలాలు పొందలేక పోతున్నారని మరోవైపు ప్రభుత్వ గణాంకాలు వివరించడం విడ్డూరంగానే కనిపిస్తుంది. ఆ పరిస్థితిని అధిగమించి, అందరికీ అభివృద్ధి ఫలాలు సమానంగా అందేలా చూసేందుకు 11వ పంచవర్ష ప్రణాళిక 'ఇన్‌క్లూజీవ్ గ్రోత్' తన లక్ష్యంగా ఇప్పుడు సరికొత్తగా ప్రకటించింది. ప్రభుత్వం చెబుతున్న 63 సంవత్సరాల అభివృద్ధి లెక్కలు వింటున్న ప్రజలకు, వాస్తవాలు అధ్యయనం చేస్తున్న సామాజిక శాస్త్రవేత్తలకు స్వాతంత్ర్యం సాధించినప్పటి నుంచీ 63 సంవత్సరాలుగా ఎంత అభివృద్ధి సాధించినా, ఫలితాలు అందరికీ సమానంగా అందక మానవ వనరుల అభివృద్ధి దాదాపుగా నిలిచిపోయిందన్న భావనతో భారత ప్రభుత్వం, 1985లో కేంద్రస్థాయిలో ప్రత్యేకమయిన 'మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ'ను ఏర్పరచింది. కేంద్ర విద్యాశాఖను రెండు విభాగాలుగా- పాఠశాల విద్య- అక్షరాస్యత, ఉన్నత విద్యా విభాగాలుగా విభజించి, మానవ వనరుల అభివృద్ధి శాఖతో అనుసంధానించి పర్యవేక్షిస్తోంది. మానవవనరులు వికాసానికి విద్య ప్రధానమైన వనరులుగా గుర్తించి, సమాజంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సమాన స్థాయిలో విద్యను అందించాలని కృషి సాగిస్తోంది. ప్రత్యేక మానవ వనరులశాఖ ఏర్పడి 25 సంవత్సరాలు గడిచిపోతున్నప్పటికీ, సమాజంలోని అట్టడుగు వర్గాలకు విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలు అందించడంలో నేటికీ విఫలమవుతున్నామన్న చేదునిజాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## అక్షరాస్యత అంతంతే!

2007 సంవత్సరం నాటికి భారతదేశ సగటు అక్షరాస్యత కేవలం 66 శాతం. స్త్రీల సగటు ఆయుఃప్రమాణం 66 సంవత్సరాలు కాగా, పురుషుల సగటు ఆయుఃప్రమాణం 63 సంవత్సరాలు మాత్రమే. శిశుమరణాల రేటు ప్రతి వెయ్యి మందిలో 52 మంది కావడం గమనార్హం. ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో పౌష్టికాహారం కొరవడిన వారి శాతం 2006 నాటికి 43.5 శాతం. కనీస అవసరాలు కొరవడిన వారు భారతదేశంలో నూటికి నలభై మందికి పైగా ఉన్నారు. 1983-93 మధ్య కాలంలో 2.6 శాతంగా ఉన్న ఉద్యోగావకాశాల రేటు, 1993-2000 మధ్య కాలానికి 1.2 శాతానికి పడిపోయింది. ఇదే కాలంలో వ్యవసాయ రంగంలో ఉపాధి కల్పనా రేటు మరింతగా పడిపోవడం ఆందోళన కలిగించే అంశం.

వివిధ ప్రాంతాలు, సామాజిక వర్గాల మధ్య మానవ వనరుల అభివృద్ధిలో చోటు చేసుకుంటున్న వ్యత్యాసాలు విభేదాలకు, ఘర్షణలకు దారితీయడం కలవరపరుస్తున్నది. మానవ వనరుల మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం, 2001లో దేశ సగటు అక్షరాస్యతా శాతం 65 కాగా, ఆంధ్రప్రదేశ్‌లో అది 62 శాతమే. గ్రామీణప్రాంత అక్షరాస్యతను గమనిస్తే దేశం సగటు 59 శాతం కాగా, మన రాష్ట్ర శాతం 55. అదే స్త్రీలలో దేశ సగటు 47 శాతమయితే, రాష్ట్ర శాతం 44.

2007 ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి నివేదిక ప్రకారం, 1991-2000 మధ్య కాలంలో రాష్ట్ర జనాభాలో ఎస్సీ జనాభా శాతం 15.9 నుంచి 16.6కు పెరగగా, ఎస్టీల శాతం 6.3 నుంచి 6.6కు పెరిగింది. ఎస్సీలలో మొత్తం కులాల సంఖ్య 59 కాగా, ఎస్టీ జాతుల సంఖ్య 33గా ఉన్నాయి. ఎస్సీలు గరిష్టంగా నెల్లూరు జిల్లాలో 22శాతం, ప్రకాశంలో 21, చిత్తూరులో 18.7 శాతంగా ఉన్నారు. ఎస్టీలు అతితక్కువగా వైఎస్ఆర్ జిల్లాలో 2.4 శాతం, అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 26.5 శాతం కావడం గమనించదగ్గది. మొత్తం రాష్ట్ర ఎస్టీ జనాభాలో తెలంగాణలో 55శాతం మంది ఉన్నారు. రాష్ట్రంలో 1991లో వీరి మానవ వనరుల అభివృద్ధి సూచీని గమనిస్తే – ఎస్సీలలో స్త్రీల నిరక్షరాస్యతా శాతం 89.6 కాగా, ఎస్టీ స్త్రీలలో అది 96.5 శాతం. ఇతర కులాల్లోని స్త్రీల నిరక్షరాస్యత 82.4 శాతం నుంచి 65.8 శాతానికి తగ్గింది. మొత్తం ఎస్సీలలో 1991-2005 మధ్య కాలంలో నిరక్షరాస్యత 89.6 శాతం నుంచి 71.6కు తగ్గగా, ఎస్టీలలో 96.5 నుంచి 86.3కు తగ్గింది. ఇతర కులాలలో 82.4 శాతం నుంచి గణనీయంగా 40.6 శాతానికి తగ్గడం గమనార్హం. 1991లో 5-14 సంవత్సరాల మధ్య వయసు కలిగిన ఎస్సీ పిల్లల్లో బడికి పోనివారి శాతం 64కాగా, ఎస్టీ పిల్లల్లో 76 శాతం. ఇతర కులాల్లో అది 53 శాతం 2001 నాటికి ఈ సంఖ్య వరుసగా 24.2,36.8,21.9 శాతానికి తగ్గాయి. 2004-05లో అవి మరింత తగ్గి 19.6,13.4,10.1 శాతంగా నమోదయ్యాయి.

## వైద్యం అందని బడుగుజీవులు

మానవ వనరుల అభివృద్ధి సూచీలో అక్షరాస్యతతో పాటు ఆరోగ్యానికి గణనీయమైన ప్రాముఖ్యముంది. వైద్య సేవల లభ్యత. పోషకాహార స్థాయి. శిశు మరణాల రేటు, రక్తహీనత, తల్లుల మరణాలు, ఆడ శిశువుల నిష్పత్తి మొదలైనవి ఆరోగ్యవంతమైన మానవ వనరులను నిర్ణయిస్తాయి. శిశు మరణాల రేటు సగటున ఎస్సీలలో వెయ్యికి 97కాగా, ఎస్టీలలో 104గా నమోదయింది. రక్తహీనత ఎస్సీలలో 56 శాతం కాగా, ఎస్టీలలో 49 శాతం. ఎస్సీ, ఎస్టీ స్త్రీలలో పోషకాహార లోపం మూలంగా శిశు మరణాల రేటు అధికంగా ఉంటుందన్నది నిపుణుల నిర్ధారణ.

## కరువైన కనీస అవసరాలు

సొంత ఇల్లు, శుభ్రమైన త్రాగు నీరు, పారిశుధ్యం, పాఠశాల, ఆసుపత్రి, విద్యుత్ సౌకర్యం వంటివి అధిక శాతం ఎస్సీ, ఎస్టీలకు నామమాత్రంగానే లభిస్తున్నాయి. రాష్ట్రంలో 26 వేల గ్రామాలు ఉండగా, అందులో 9 శాతం గ్రామాలు పూర్తిగా ఎస్టీలు నివసిస్తున్నవి. 20శాతం గ్రామాలలో 50 శాతంగా ఉన్నారు. ఎస్సీల విషయానికొస్తే కేవలం 3 శాతం గ్రామాలలో మాత్రమే వీరు పూర్తిగా నివసించడం కనిపిస్తుంది. 2001 లెక్కల ప్రకారం ఎస్టీలు నివసించడం కనిపిస్తుంది. 2001 లెక్కల ప్రకారం ఎస్టీలు నివసిస్తున్న 90 శాతం గ్రామాలకు మంచినీటి సౌకర్యం లేకపోగా, 67 శాతం గ్రామాలకు రోడ్డు సదుపాయాలు లేవు. అలాగే, 60 శాతం ఎస్టీ జనాభా కేవలం ఒకే గది కలిగిన గృహాల్లో నివసిస్తున్నారు. వీరు నివసిస్తున్న 64 శాతం గ్రామాలకు విద్యుత్ వసతి లేని గ్రామాలు 56.6 శాతం కాగా, 90 శాతం గ్రామాల్లో మరుగుదొడ్లు, పారిశుధ్య సౌకర్యాలు కనిపించవు. 59 శాతం గ్రామాలకు కనీస స్థాయిలో కూడా తాగునీటి సదుపాయం లేదు. ఎస్సీలలో 94 శాతం మందికి వంటకు కట్టెల పొయ్యే శరణ్యం. దేశంలో సగటున 49 శాతం ప్రజలకు మరుగుదొడ్ల సౌకర్యం ఉండగా, రాష్ట్రంలో కేవలం 35 శాతం మందికి మాత్రమే ఆ సదుపాయం ఉంది. ఈ లెక్కలు గమనిస్తే, సమాజంలో బడుగు, బలహీన వర్గాల మానవ వనరుల సూచీ ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతుంది.

## వ్యవసాయమే జీవనాధారం

ఏ సమాజంలో నివసిస్తున్న వారికయినా, వారి వృత్తులే వారికి ప్రధాన ఆదాయ వనరులు. నేటికీ ఎస్సీ, ఎస్టీల ప్రధాన జీవనాధారం వ్యవసాయమే. వీరిలో 90 శాతం పైగా గ్రామాల్లో కూలీలుగా జీవిస్తున్నారు. 1993-94లో ఎస్సీ వ్యవసాయ కూలీల శాతం 69 కాగా, 2004-05 నాటికి 60.7 శాతానికి తగ్గింది. అదే కాలంలో ఎస్టీ కూలీల శాతం 37 శాతం నుంచి 43.7 శాతానికి పెరిగింది. అలాగే, సొంత పొలంలో వ్యవసాయం చేసే ఎస్టీల శాతం 45 నుంచి 35.5కి పడిపోయింది. అదే ఎస్సీలలో 11.8 నుంచి 11.6కు తగ్గింది. సాగు నీటి సదుపాయాలు కలిగిన భూమి ఎస్సీలలో 13.5 శాతం కాగా, ఎస్టీలలో 21.7 శాతం. ఇతర కులాల్లో 30.6 శాతం కావడం గమనార్హం. వ్యవసాయేతర రంగాలలో ఉన్న ఎస్సీల శాతం 10.3 కాగా, ఎస్సీల శాతం 10.9 మాత్రమే.

ఏ రంగాన్ని గమనించినా ఎస్సీ, ఎస్టీల మానవ వనరుల అభివృద్ధి రేటు అత్యంత కనిష్ట స్థాయిలో ఉండటం ప్రమాదకరమైన సూచనగా గుర్తించక తప్పదు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాల వారికి చేరనంత వరకూ మహాత్మాగాంధీ, నెహ్రూ కన్న కలలు కల్లలుగానే మిగిలిపోతాయన్న కఠోర వాస్తవాన్ని పాలకులు గుర్తించాలి. దీర్ఘకాలిక ప్రాతిపదికపై ఆచరణాత్మకమైన చర్యలు చేపట్టి భవిష్యత్ తరాలకైనా బతుకు భారం కాకుండా చూడాలి. ◆

('సాక్షి' సౌజన్యంతో...)

# భూతల స్వర్గంలో రక్తపాతం: కాశ్మీర్

-శ్రీనివాసమూర్తి

"నా ప్రజలు రోజు హతమవుతున్నారు, దాంతో ఉద్వేగానికిలోనై ఈ పని చేసాను." ఈ మాటలు అన్నది ఒక పోలీసు అతను చేసిన నేరం 'స్వాతంత్ర్య దినోత్సవంనాడు కాశ్మీరు ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా మీద బూటు విసరడం.' సభ్య సమాజం ఈ రకమైన నిరసనని అంగీకరించక పోవచ్చు. కాని కాశ్మీర్‌లో విషమ పరిస్థితికి ఇది ఒక నిదర్శనం.

1989లో మొదలైన తీవ్రవాదం, భూతల స్వర్గమైన కాశ్మీర్‌ని భూతాల స్వర్గంగా మార్చివేసింది. ఆ తరువాత జన్మించిన యువత, ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలకి నాయకత్వం వహిస్తున్నారు. వీరికి అశేష కాశ్మీర్ ప్రజానీకం మద్దతు పలుకుతున్నారు.

ఆందోళనలు, పోలీసు బలగాల మీద రాళ్ళ దాడులు, సాయుధ బలగాల కాల్పులు, బులెట్ గాయాలతో యువత మరణం, ఇవి ప్రస్తుతం కాశ్మీరు చరిత్రలో నిత్య కృత్యాలు, పోలీసు కాల్పులలో మరణించిన వారి సంఖ్య 100 దాటింది. 100ల మంది గాయపడ్డారు. లెక్కలేనన్ని ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం జరిగింది. చాలా మంది పోలీసులు గాయపడ్డారు.

కాశ్మీరిలను ఇంతగా ఆందోళన పథంలో నడిపిస్తుంది ఎవరు అని మనం విశ్లేషిస్తే మనకు వివిధ శక్తులు గోచరిస్తాయి. అవి పాకిస్తాన్ ఐఎస్ఐ హస్తం కావచ్చు, హురియత్ పిలుపు కావచ్చు. ప్రతిపక్ష పిడిపి నాయకురాలు మెహుబబాముక్తికుయక్తి కావచ్చు, లేక విఫలమైన ఓమర్ అబ్దుల్లా పాలన కావచ్చు, కాని స్పష్టంగా చెప్పగలిగే కారణం మాత్రం ఒకటే. "ప్రస్తుత వ్యవస్థ మీద అంతులేని ఆగ్రహం" ఈ అంతులేని ఆగ్రహమే వారికి నాయకత్వం వహిస్తుంది.

జూన్ 11వ తేదిన, 12వ తరగతి చదువుతున్న తఫాయిల్ అహ్మద్ మట్టో అనే యువకుడు సిఆర్‌పిఎఫ్ కాల్పులో గాయపడి మరణించటంతో, తీవ్రమైన ఈ ఉద్యమం, మరికొన్ని గొలుసుకట్టు సంఘటనలతో ఉధృతమైంది. కేవలం ఈ సంఘటనలు మాత్రమే ఉద్యమానికి ఆజ్యం అని చెప్పలేము కొన్ని సంవత్సరాలుగా కాశ్మీర్‌ల గుండెల్లో గూడు కట్టుకున్న అసంతృప్తి, ఈ సంఘటనలతో తీవ్ర ఉద్యమం వైపు పయనించేలా చేసింది అని చెప్పవచ్చు. ఈ ఉద్యమం యొక్క పుర్వాపరాలను మనం పరిశీలిస్తే, 2008లో జరిగిన అమర్‌నాథ్ దేవాలయ స్థల వివాదంతో మొదలైన అసంతృప్తి, సోపోర్ జిల్లాలో జరిగిన అనుమానస్పద మరణాల మీద ఎటువంటి చర్యలు గాని, సరియైన దర్యాప్తు లేకపోవడం, అన్నింటికన్నా ముఖ్యంగా కాశ్మీరులో ప్రీపెయిడ్ సెల్‌ఫోన్ వినియోగాన్ని నిషేదిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, కాశ్మీర్‌ల గుండెలను తీవ్రంగా గాయపరిచింది అని చెప్పవచ్చు. ఇవే కాకుండా సాయుధ బలగాల ప్రత్యేకాధికార చట్టం ద్వారా Armed forces special power act అపరిమితమైన సైన్యం యొక్క అధికారాలు, కాశ్మీర్ యువతలో పెరిగిన నిరుద్యోగం, కూడా ప్రస్తుత ఆందోళనలకి కారణంగా మనం భావించవచ్చు.

ఆందోళన పథంలో పయనిస్తున్న కాశ్మీరీల నుంచి వినిపిస్తున్న బలమైన కోరిక "ఆజాదీ", కాశ్మీరు ఒక స్వాతంత్ర దేశంగా వుండాలని వారి కోరిక కాని ఈ కోరిక కోరుతున్న వారు గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే "భారత్ వంటి సర్వసత్తాక, సార్వభౌమాధికార దేశం ఎట్టి పరిస్థితిలోను 'ఆజాది' వంటి గొంతెమ్మ కోరికలను అంగీకరించదు' ఈ కోరికని పాకిస్తాన్ కూడా అంగీకరించక పోవచ్చు. భారత్, పాకిస్తాన్‌లు తమ మధ్యలో మరొక ఆఫ్ఘానిస్తాన్ తయారు కావాలన్న ఎట్టి పరిస్థితిలోను అంగీకరించవు. ఆఫ్ఘాన్ ప్రజల జీవితాలతో అంతర్జాతీయ సమాజం వెలగబెడుతున్న నిర్వాకం అందరికి ముఖ్యంగా కాశ్మీరిలకి తెలియంది కాదు.

"సైన్యం ప్రమేయం లేని పరిపాలన, ఆత్మాభిమానంతో ఎటువంటి నిర్బాందం లేని వ్యవస్థని కాశ్మీరిలు "ఆజాది" డిమాండ్ రూపంలో కోరుకుంటున్నారు అని భావించవచ్చు."

కాశ్మీరీలలో మరికొంత మంది కోరుకుంటున్నది, కాశ్మీరు పాకిస్తాన్‌లో విలీనంకావడం. మెజారిటి కాశ్మీరిలు తీవ్రంగా వ్యతిరేకించే ప్రత్యమ్నాయం. ఇది కేవలం కొంత మంది పిడివాదుల కోరిక మాత్రమే. విలినం, జరుగుతుందని సాక్షాత్తు పాకిస్తాన్ సైన్యానికే నమ్మకం లేనప్పుడు, దాని గురించి చర్చ అనవసరం.

స్వయంప్రతిపత్తి, కాశ్మీర్‌లోని మెజారిటి ప్రజలు, రాజకీయ పక్షాలు కోరుకుంటున్న న్యాయబద్ధమైన కోరిక ఈ కోరిక భారత రాజ్యాంగానికి లోబడి వుండాలని భారత ప్రభుత్వం, రాజ్యాంగంతో సంబంధం లేకుండా పరిష్కారించాలని ప్రజలు కోరుకుంటున్నారు. కాశ్మీరిలకి భారతదేశంలో దూరం చేస్తున్న ప్రస్తుత పరిస్థితులని అధిగమించడానికి భారత ప్రభుత్వం ద్విముఖ వ్యూహంతో ముందుకు వెళ్ళవలసి వుంటుంది. అది చర్చలు మరియు చర్యల ద్వారా కాశ్మీరీల హృదయాలను గెలవడానికి ప్రయత్నిస్తూ, పాకిస్తానుతో చర్చల ద్వారా శాశ్వత పరిష్కారం కనుగొనడం.

ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వం వున్న కాశ్మీర్‌లో, సాయుధ బలగాల ప్రత్యేకాధికార చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ) ద్వారా అపరిమితమైన అధికారాలు కలిగిన సైన్యం ఉనికిని కాశ్మీరీలు

తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉపసంహరించాలని కోరుతున్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం సంకట స్థితిని ఎదుర్కొటుంది. సైన్యంతోపాటు, విపక్షమైన బి.జె.పి స్వపక్షమైన కేంద్ర రక్షణ మంత్రి, కాశ్మీర్‌లో ఈ చట్టం యొక్క ఆవశ్యకతను గట్టిగా తెలియచేస్తున్నారు. కాశ్మీర్‌లో విదేశీ ప్రోత్సాహంతో వున్న తీవ్రవాదాన్ని అదుపులో పెట్టడంతో సైన్యం యొక్క విషయాలు, త్యాగాలు మరువలేనివి. కాబట్టి వారి వాదనలు విస్మరించరానివి. కాని జాతి విశాల ప్రయోజనాల రీత్యా సైన్యం యొక్క మనోస్థైర్యం దెబ్బతినకుండా, సైన్యం యొక్క రాజ్యాంగబద్ధ హక్కులు కాపాడుతూనే తీవ్రవాదం తక్కువగా వున్న జిల్లాల్లో ఈ చట్టాన్ని పాక్షికంగా ఉపసంహరించాలి.

కాశ్మీరీల హృదయాలను జయించే క్రమంలో, భారత ప్రభుత్వం నిజమైన చర్చావేదికను నిర్మించాల్సిన అవసరం వుంది. ఈ వేదికలో అన్ని పక్షాలను భాగస్వాములని చెయ్యాలి. అవి అధికార నేషనల్ కాన్ఫరేన్స్, ప్రతిపక్ష పిడిపి, ప్రవాసంలో వున్న కాశ్మీరి పండితులు, డోగ్రాలు, షియా ముస్లింలు, జమ్ము ముస్లింలు, లధక్ బౌద్ధులు, హురియత్ (మితవాదులు), జె.కె.ఎల్.ఎఫ్, మరియు జాతీయా పార్టీలైన కాంగ్రెస్, బి.జె.పి.లు భాగస్వామ్యం కావాలి.

ఇటువంటి నిజమైన చర్చావేదిక ద్వారా "ఆకాశమమే హద్దుగా, మానవత్వంతో కూడిన రాజ్యాంగబద్దమైన" పరిష్కారాలను కాశ్మీరిలకు సూచించవచ్చు.

ప్రస్తుతం కాశ్మీర్‌లో జరుగుతున్న పరిణామాలను, భారత అంతర్గత వ్యవహారంగా మనం భావించవచ్చు. కాని పాకిస్తాన్ ప్రమేయం లేకుండా కాశ్మీర్‌కి శాశ్వత పరిష్కారం దుర్లభం. పాకిస్తాన్ కాశ్మీర్‌లో ప్రభావం చూపించగలదు అనే చేదు నిజాన్ని మనం అంగీకరించాలి. అంతే కాకుండా అఖండా జమ్మూ కాశ్మీర్లో చాలా భాగం పాక్తిస్తాన్ ఆధీనంలో వుంది అన్న విషయం ఇక్కడ గమనార్హం కాబట్టి పాకిస్తాన్‌లో చర్చలకు శ్రీకారం చుట్టడం అత్యవసరం.

"జాతీయతకు లోబడి వుండే ప్రత్యేక ఆకాంక్షలని, వాదాలని గౌరవించవచ్చు. ఈ ఆకాంక్షలు జాతీయ ప్రయోజనాలని పెంపొందిస్తే వాటిని అంగీకరించవచ్చు. కాని జాతీయతను దాటుకొని ప్రయాణిస్తున్న కాశ్మీర్‌ల ఆకాంక్షలను గమనిస్తూ వారిని భారత జాతీయతను గౌరవించే పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత భారత ప్రజలమైన మన అందరి మీద వుంది.

భౌగోళికంగా జమ్మూకాశ్మీర్ భారత్‌లో అంతర్భాగం, మానసికంగా కూడా జమ్మూ, కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అయ్యే రోజు తొందరలోనే రావాలని ఆశిద్దాం. ◆

# రాజకీయాలను మలుపు త్రిప్పే దిశగా

## లోక్‌సత్తా పార్టీ "సర్వజన సత్తా"

- పి.వి.రావు

**దేశ** చరిత్రలో ఎక్కడ చూసినా ఎస్.సి., ఎస్.టి, బి.సి. మైనారిటీలను పావులుగా వాడుకొని వదిలేస్తున్నారు. వీరు విద్యాపరంగా, ఆర్థికంగా సామాజికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా

ఎదగక పోవడమే దీనికి ముఖ్య కారణం. వీరి బలహీనత ప్రతి విషయానికి ఎవరి మీదనో ఒకరి మీద ఆధారపడడం, వారిపై నమ్మకంతో వారేంచెప్పినా చేయడం, వివిధ ఆశలు చూపి వారి చుట్టూ తిప్పుకోవటం, వారి వ్యక్తిగత పనులను చేయించుకోవటం చేస్తున్నారు. అదే విధంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు, కలం పోటుతో జరిగి పోయే పనులకు కూడా వారి వారి ఉనికిని చాటు కోవడం కోసం ధర్నా అంటూ, ఉద్యమం అంటూ రెచ్చగొట్టి అవసరాన్ని బట్టి ఉద్రేకపరచి మరీ ఆత్మహత్యలకు పాల్పడే విధంగా ఈ అమాయక ప్రజలను ప్రేరేపించి బలిచేస్తూ శవాలపై రాజకీయాలు చేస్తున్నారు. ఈ అమాయకులు ఆవేశాలకు పోయి ఏం చేస్తున్నామో, ఏమౌతామో కూడా తెలియక ప్రాణాలు కోల్పోవడం, జైళ్ళల్లో మగ్గడం, కోర్టుల చుట్టూ తిరగడం వంటి ఇబ్బందుల్లో ఇరుక్కు పోయి జీవితాలను పాడు చేసుకుంటున్నారు.

ఎన్నికలు వచ్చాయంటే చాలు రోజు వారీ కూలీ ఇచ్చి ఈ జనాలను బహిరంగ సభలకు పిలిపించుకొని అది వారి మెజారిటీగా చూపించుకుంటారు. బిర్యానీ పొట్లాలు, సారాయి, పోయించి, చీరలు, టీవీలు, సైకిళ్ల వంటి ప్రలోభాలు పెట్టి ఓటు విలువ తెలియని అమాయకుల ఓట్లను వారి వైపు తిప్పుకొని అధికారంలోకి వస్తారు.

కేవలం 10-20 రోజుల్లో ముగిసే ఎన్నికల ప్రచారంలో తన నియోజక వర్గంలోని ప్రతి ఇంటిని రాజకీయ నాయకుడు దర్శిస్తాడు. కానీ గెలిచాక 5 సంవత్సరాల కాలంలో ఒక్కరోజు వారింటికి రాకపోగా తన వద్దకు వెళ్లిన వారిని గంటల తరబడి, రోజుల తరబడి తన ఇంటి చుట్టూ త్రిప్పుకుంటాడు. ఇలా ఎందుకు జరుగుతుందో చాలా మంది ప్రజలకు తెలియదు. ఆ విషయం తెలిసిన రోజు రాజకీయం మారిపోతుంది.

ప్రజల్లో రానూ రానూ మార్పు వస్తుంది. మార్పును ఆశిస్తున్నారని గత 2009 అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా లోక్‌సత్తా పార్టీకి వచ్చిన ఓట్లు నిరూపించాయి. గట్టి నమ్మకాన్ని కలిగించాయి. అందుకే విద్యా, ఆర్థిక సామాజిక, సాంస్కృతిక, రాజకీయంగా వెనుకబడ్డ ఎస్.సి., ఎస్.టి, బి.సి., మైనారిటీలను ఆయా రంగాలలో చైతన్య పరచి సంఘటితం చేసి రాజ్యాధికారం వైపు మలుపు తిప్పి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సత్తా పార్టీ తప్ప మరో పార్టీ ఈ రాజకీయాలను మార్చ లేవనే గట్టి సంకేతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు "సర్వజన సత్తా" బృందం పట్టుదలతో ఎన్ని కష్టాలకైనా సిద్ధపడి పని చేసేందుకు సిద్ధమవుతున్నది. దీనికి జేపి నాయకత్వంపై నమ్మకం, లోక్‌సత్తా పార్టీ సిద్ధాంతాల బలం. అవసరం ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ◆

# గుంటూరు జిల్లా

ఆంధ్రప్రదేశ్ రైతాంగా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన రైతు చైతన్య యాత్రలో భాగంగా డా॥ జేపీ గుంటూరు జిల్లాలో చేసిన ప్రసంగాలలో ముఖ్యాంశాలు...

## గుంటూరు

- దేశంలో వ్యవసాయాన్ని ప్రభుత్వాలే ఒక పద్ధతిప్రకారం నాశనం చేస్తున్నాయి.
- సమస్యలపై రైతులకు అవగాహన కల్పించి సంఘటితం చేసేందుకే ఈ రైతు చైతన్యయాత్ర.
- వ్యవసాయాన్ని నాశనం చేసి, దేశాన్ని విదేశాలకు తాకట్టుపెట్టి, రైతుల్ని బిచ్చగాళ్ళుగా మార్చేస్తున్నాయి.
- ఈ పోరాటం ఏ ఒక్క పంటకో పరిమితం కాదు.
- వ్యవసాయానికి విముక్తి కావాలి. ధాన్యానికి ధర కావాలి. గోదాములు ఖాళీ చేయాలి. విదేశాలకు ఎగుమతులకు అనుమతినివ్వాలి. కనీస మద్దతు ధరకు కనీసం రూ॥ 200 చేర్చి రైతుకి ఇవ్వాలి. దీనికోసం రైతులు సంఘటితం అవ్వాలి.
- ప్రస్తుతం 4,62 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు ఎఫ్‌సిఐ, రాష్ట్రాల గోదాముల్లో ప్రభుత్వాల చేతుల్లోనే మగ్గుతున్నాయి. రాష్ట్రంలో 1.48 కోట్ల టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతుందని అంచనా.
- బీపీ ఎల్-5204 సోనామసూరి రెండు నెలల క్రితం రూ॥ 1200-1300 పలికింది. ఈ రోజు రూ॥ 700 నుంచి 800 కి పడిపోయింది. రాష్ట్రంలోని 50-60 శాతం మంది ఈ పంట వేసారు. అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకీ వుంది. కేంద్రప్రభుత్వం ఎఫ్‌సీఐ, ఎస్‌టీసీ, ఎంఎంటీసీ వంటి సంస్థల ద్వారా అమ్మితే గోదాములు ఖాళీ అవుతాయి. కోటి టన్నులు అమ్మినా ఖర్చులు పోను కనీసం 50 వేలకోట్లు విదేశీమారకద్రవ్యం ఆదాయం వస్తుంది. ఆ లాభం రైతుకి మద్దతు రూపంలో ఇవ్వండి. కొంత మూలధనంగా పెట్టండి. గోదాములు కట్టండి.
- రైతులకు మేలు జరిగే వరకు ఈ పోరాటం ఆగదు. అలా జరగనిపక్షంలో రాష్ట్రాన్నే కాదు, దేశాన్ని సైతం స్తంభింపజేస్తాం.
- రైతుల ప్రయోజనాలను కాంక్షిస్తూ మిగతా రాష్ట్రాలను కూడా కలుపుకుని దేశవ్యాప్తంగా ఉద్యమించేందుకు లోక్‌సత్తా సిద్ధమవుతోంది. నవంబర్ 3వ తేదీన కర్నాటకలోని సింగనూరులో జరిగే రైతు సదస్సుల్లో జేపీ పాల్గొంటారు.

## ఖాజీపాలెం

- ప్రభుత్వం ప్రకటించిన వరి మద్దతు ధర రైతులకు లాభసాటి కాదు.
- చౌకధరల బియ్యానికి, ఆహార భద్రతకు పోను మిగిలిన ధాన్యాన్ని ఎగుమతి చేసుకునేందుకు రైతులకు, మిల్లర్లకు స్వేచ్ఛనివ్వాలి. కనీసం భారతదేశంలో ఎక్కడ రైతుకు అనువైన ధర లభిస్తుందో అక్కడికి ఎగుమతి చేసుకునేలా ఆంక్షలు ఎత్తివేయాలి.
- ఒక్కో మండలం నుంచి 25 మంది రైతులు సంఘటితమై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధంకావాలి.




## రేపల్లె

- రైతుకు గిట్టుబాటు ధర రాకపోగా మధ్యలో వున్న బ్రోకర్లు, వ్యాపారులు లాభాలు ఆర్జిస్తున్నారు.
- సోనామసూరి ధాన్యం ఎగుమతి వలన ప్రస్తుతం రైతులకు అందిస్తున్న రూ॥ 1,050 గిట్టుబాటు ధరను రూ॥ 1500 లకు పెంచి అందించగలిగేవారు.
- రైతులు కేవలం వారి హక్కులను అడుగుతున్నారే తప్ప అడుక్కోవడంలేదు.
- తక్షణమే స్వామినాధన్ సిఫార్సులను అమలు చేసి, ఉత్పత్తి వ్యయంపై 50 శాతం కలిపి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి.
- యాంత్రీకరణకు పెద్ద ఎత్తున చేయూతనిచ్చి, ఆధునిక వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందించాలి.
- కౌలు రైతులకు, సన్న, చిన్నకారు రైతులకు తక్కువ వడ్డీతో రుణాలతోపాటు ప్రభుత్వ సహాయం అందించాలి.
- వ్యవసాయ భూములు లింకు రోడ్లకు నిధులు కేటాయించాలి.
- చిన్న, సన్నకారు రైతులకు పెన్షన్‌లు అందించే ప్రత్యేక పథకాన్ని రూపొందించాలి
- వ్యవసాయ రంగ పనులకు గ్రామీణ ఉపాధిహామీ పథకం ఉపయోగపడేలా చూడాలి.

- పశుభీమా పథకాలను రూపొందించి, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రుణాలు రద్దు చేయాలి.
- వ్యవసాయ, నీటి పారుదల శాఖలను కేంద్రప్రభుత్వం పరిధిలోకి తీసుకొని ప్రత్యేక బడ్జెట్‌ను ప్రకటించాలి.
- సిఎసిపికి స్వయం ప్రతిపత్తి కల్పించి ధరల నిర్ణయంలో రైతులను భాగస్వాములను చేయాలి.
- పరిశ్రమలకు ఏ సూత్రం వర్తిస్తుందో వ్యవసాయ రంగానికి కూడా అదే సూత్రం వర్తిస్తుంది.
- ఖనిజ సంపదను సైతం యధేచ్ఛగా నాయకులు తరలిస్తుంటే ప్రభుత్వం ప్రోత్సహించడం దురదృష్టకరం.
- వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించుకునేందుకు రైతులు సన్నద్ధం కావాలి.
- పంట ఉత్పత్తులకు స్వేచ్ఛ మార్కెట్ సదుపాయం కల్పించకుండా, పంటలకు ధర రాకుండా కృత్రిమంగా అదుపు చేయడం వల్ల, రోజుకి రూ॥ వెయ్యి కోట్ల వంతున రైతాంగానికి (ఏటా 3 లక్షల కోట్లు) నష్టం వాటిల్లుతోంది.
- ఆంక్షలు లేకుండా ఎక్కడ ధర వుంటే అక్కడ అమ్ముకునేలా చేస్తే దేశంలో 55 శాతం వున్న రైతులకు గిట్టుబాటు ధరతో పాటు కొనుగోలు శక్తి పెరుగుతుంది. దాని వల్ల పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందుతాయి.

రైతాంగ సమాఖ్య ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష రైతు సదస్సు జరిగింది. రైతాంగ సమాఖ్య అధ్యక్షులు యెర్నేని నాగేంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు ముప్పలనేని శేషగిరిరావు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సిపిఎం నాయకులు రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, తెదేపా నేత కేసన శంకరరావు, రైతాంగ సమాఖ్య గౌరవాధ్యక్షులు సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పిఆర్‌పి నాయకులు కాగితాల సుబ్బారావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మార్కెట్‌యార్డు ఛైర్మన్ మల్లెల రామచంద్రరావు, కన్నెగంటి శివప్రసాద్, మేకల లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నూరు

- అంతర్జాతీయంగా మంచి డిమాండ్ వున్న బీపీటీ ధాన్యం ఉత్పత్తికి కేంద్రమైన గుంటూరులో ధరపతనం కావడం ఆందోళనకరం. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిగ్గుచేటు. రైతులు కులం, ప్రాంతం, పార్టీల వారీగా విడిపోవడం వల్లనే ఈ దుర్గతిపట్టింది. రైతులంతా ఒక్కటేనని గుర్తించి ఏ సమస్యపై అయినా ఐక్యంగా ఉద్యమించకపోతే వ్యవసాయం నాశనమయిపోతుంది.





- వరి, పత్తి పంటలకు ఖ్యాతిగాంచిన గుంటూరులో కూడా రైతులు వ్యవసాయాన్ని వదిలేసే స్థితికి చేరుకోవడం ఆవేదన కలిగిస్తోంది.
- ఆనాడు టెక్నాలజీని ఇవ్వమని పత్తిరైతులు అడిగితే ఏడు సంవత్సరాల పాటు జాప్యం చేసిన ప్రభుత్వం ఆ తరువాత ఎగుమతులపై ఆంక్షలు తీసుకొచ్చి ధర పడిపోవడానికి కారణం అయ్యింది. బియ్యం ఎగుమతులపై నిషేధం విధించడంతో డిమాండ్ పడిపోయి నేడు బిపీటీ వెరైటీని కూడా రూ॥ 1030 కి అమ్ముకోవలసిన గతి రైతుకు పట్టింది.
- బీపీటి 5204 రకానికి అంతర్జాతీయ మార్కెట్‌లో రూ॥ 110 ధర వుంది. దీని దృష్ట్యా ప్రభుత్వం రైతుల నుంచి రూ॥ 55కి కొనుగోలు చేసి ఎగుమతుల ద్వారా కలిగిన లాభాన్ని వ్యవసాయ రంగానికి ప్రోత్సహకాల రూపంలో ఇవ్వాలి. దీనివల్ల దేశంలో రైతుల మరణాలు వుండవు.
- రైతు బాగుపడడం ప్రభుత్వాలకు ఏ కోశానా ఇష్టం లేదు. విదేశాలనుంచి దిగుమతులు నిలిపేయడం/సుంకాలు విధించడం, ఇక్కడ ఎగుమతులను ప్రోత్సహించడం ద్వారా ఖచ్చితంగా రైతుకు లాభం చేకూరుతుంది.
- ఫ్రాన్స్ వంటి చిన్న దేశాలలో 3% మాత్రమే వ్యవసాయం వుంది. అయినా అక్కడి ప్రభుత్వం రైతులకు ఇబ్బడిముబ్బడిగా రాయితీలిస్తుంటే 60% పైగా వ్యవసాయ ఆధారితమైన మన దేశంలో రైతుకు ధర లేకుండా చేస్తుండటం ఘోరం
- నాడు మన్మోహన్‌సింగ్ ఆర్థిక మంత్రిగా వున్న సమయంలో

పారిశ్రామికరంగంలో ఆంక్షలు ఎత్తివేయడంతో దేశం పారిశ్రామికాభివృద్ధి సాధించింది. అదే రీతిన వ్యవసాయ రంగంపై ఆంక్షలు తొలగించాలి.

- ✪ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయి.
- ✪ రైతులు ఒక్క తాటిపై నిలవకపోవడంతో రాజకీయ పక్షాలు వారిని కనీసం ఓటుబ్యాంకుగా కూడా పరిగణించడం లేదు. రైతు శ్రేయస్సు కోసం పార్టీలకతీతంగా గ్రామస్థాయి నుంచి పోరాడేందుకు ముందుకు రావాలి.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నియోజకవర్గ ఇంఛార్జి సోమరౌతు వీరశేఖరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సమాఖ్య అధ్యక్షులు ఎర్నేని నాగేంద్రనాథ్, ఉపాధ్యక్షులు ఎంవీఎస్ నాగిరెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి. రాజారావు, సిఐఐ నియోజకవర్గ కార్యదర్శి, అద్దేపల్లి మురళి, సిఐఐ పట్టణ కార్యదర్శి షేక్ కాజీసాహెబ్, సిపిఎంఎల్ పట్టణ కార్యదర్శి కోగంటి రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు లంకపోతు పిచ్చిరెడ్డి.



## సత్తెనపల్లి

- ✪ ధాన్యం నిల్వలను తరలించకపోవడంతో ధాన్యం ముక్కిపోయి చివరకు సముద్రపాలు కావల్సివస్తుంది.
- ✪ బంగారు బాతులాంటి రైతు నుండి గ్రుడ్డును మాత్రమే ఆశించాలి. కాని ప్రభుత్వాలు బాతునే తినాలని ప్రయత్నిస్తున్నాయి.
- ✪ రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే గ్రామీణ భారతం నాశనం అవుతుంది.
- ✪ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వ్యవసాయాన్ని బాగుచేసే అవకాశం వున్నా ప్రభుత్వం రైతులను మోసం చేయడం బాధాకరం.
- ✪ గిట్టుబాటు ధర కల్పిస్తే రైతు ప్రపంచాన్ని పోషించగలడు.
- ✪ నిల్వ సామర్థ్యం కన్నా అధికంగా ధాన్యం నిల్వలు రాష్ట్రంలోని గోదాముల్లో ఉన్నాయి.



## ఫిరంగిపురం

- ✪ రైతుల అనైక్యత కారణంగానే దళారులు వారిని దోచుకుంటున్నారు.
- ✪ అన్ని వ్యాపారాలకు మార్కెట్ ధర వుంటుంది. రైతు పండించిన పంటకు ప్రత్యేక ధర అంటూ లేకపోవడానికి కారణం రైతులు సంఘటితంగా లేకపోవడమే. గ్రామస్థాయిలోనే కమిటీలు ఏర్పడి ఉద్యమాలు సాగించాలి.
- ✪ మార్కెట్‌యార్డులు రైతులకు ఉపయోగపడకపోవడానికి ప్రధాన లోపం మార్కెట్ కమిటీలదే రైతుల చేతికి మార్కెట్ కమిటీలు రావాలి.
- ✪ సెజ్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్ని వ్యవసాయ పనులకే ఖర్చు చేసి, రైతులకు రుణాలివ్వాలి.

కళ్ళకు మంచి కనడుతున్నా ప్రధాని మన్మోహన్, ముఖ్యమంత్రి రోశయ్య ఏమీ తెలియనట్లు వుండి గ్రామాలను వల్లకాడు చేస్తున్నారు. వారికి రైతుల ఉసురు తప్పక తగులుతుంది.

గ్రామాల్లో 'మ్యాక్స్' సహకార సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు మీరే ఇచ్చి మీరే వసూలు చేసుకోండి అంటే ఈ సూక్ష్మరుణ సంస్థలు గ్రామాల్లో పెట్టుకొచ్చేవి కావు. రుణ సంస్థలను వ్యాపార సంస్థలుగా గుర్తిస్తూ చట్టాన్ని తీసుకువచ్చి, కచ్చితమైన వడ్డీని నిర్దేశించాలి.

- ✪ ప్రపంచంలో అన్ని దేశాలూ రైతులను కాపాడుకుంటుంటే మనదేశం ఇందుకు వ్యతిరేకంగా వుంది.
- ✪ లైసెన్సు రాజ్యం నుంచి పరిశ్రమలను తప్పించిన విధంగా వ్యవసాయాన్ని కూడా తప్పించి రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.
- ✪ పాత బిటికాటన్ ఉత్పత్తి గణనీయంగా పెరిగినప్పటికీ ప్రభుత్వం ఇతర దేశాల నుండి కాటన్ దిగుమతి చేసుకుంటూ వ్యవసాయ

రంగాన్ని నిర్వీర్యం చేస్తోంది. అంతేకాక 50 లక్షల టన్నుల పంచదార, కోటిటన్నుల పామాయిల్ నూనెను ఎలాంటి సుంకం లేకుండా దిగుమతి చేసుకొంటోంది.

- ఎవరోవస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా రైతులందరూ సంఘటితంగా ఉద్యమాలు చెయ్యాలి.
- ప్రభుత్వం రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి అధిక దిగుబడులకు అవకాశం కల్పించాలి.
- నువ్వుల పంటను ప్రోత్సహించకుండా ఇతర దేశాల నుంచి నువ్వుల నూనెను 77 శాతం మేర దిగుబడి చేసుకోవడం అభ్యంతరకరం.

ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు యర్రం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ సాంబశివరావు, లోక్‌సత్తా ఉద్యమసంస్థ అధ్యక్ష కార్యదర్శులు అబ్బూరి సత్యానారాయణ, అన్నం కృష్ణప్రసాద్, హబీబుక్ రహమాన్, మస్తాన్‌వలి, పేరయ్య, ఖాదర్, మస్తాన్, ఎస్. గఫూర్, గోపీచంద్, ఉమామహేశ్వర్‌రెడ్డి గుంటూరు టౌన్ యువసత్తా అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, మండల కార్యదర్శి భానుప్రసాద్, అనంతవీరశేఖర్ అభ్యుదయ రైతు అప్పిరెడ్డి, తోటకూర శరత్‌బాబు, పద్మారాణి, దుర్గాదేవి, పాండురెడ్డి, అంజిరెడ్డి, మహేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



### పిడుగురాళ్ళ

- అవసరానికి మించి మూడింతలు ఆహారధాన్యాల నిల్వలు వున్న 'రైతు రంగా' శిష్యుడు, గుంటూరు జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి మాత్రం ఆంధ్రప్రదేశ్ నుంచి సన్న బియ్యం పంపం అంటున్నారు. ఆయనకు రైసుమిల్లుల గురించి తెలుసు. రైతు కష్టాలు తెలియవా?
- రెండేళ్ళ కిందట చెరకు రైతును, మిల్లులను నాశనం చేయడంతో ఈ ఏడాది రూ.18 వేలకోట్లుతో 50 లక్షల టన్నుల పంచదార దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వ నిర్వాకంతోనే 80శాతం వంటనూనెలు దిగుమతి చేసుకుంటున్నాం.
- సేవ చేయాల్సిన రాజకీయం, వ్యాపారంగా మారి వ్యవసాయ రైతులను సేవ చేయమంటున్నారు.
- ఆరెకరాల ఆసామి అయిన రైతు వెంకటరెడ్డి పంటలో వచ్చిన నష్టాలు తట్టుకోలేక సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో రోజువారీ హమాలీగా చినిగిన చొక్కాలతో పని చేస్తున్నాడు.
- వ్యవసాయం సంక్షోభంలో వుందని చెప్పేందుకు ఇంతకంటే ఉదాహరణ ఇంకేం వుంటుంది.
- రాష్ట్ర వ్యాప్తంగా రైతుల కోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్
- పిడుగురాళ్ళ, మాచవరం దాచేపల్లి తదితర మండలాల నుండి గ్రామ గ్రామాన యువతను ప్రోత్సహించి రైతులకు పంటలు పండించే అంశంపై శిక్షణ నిర్వహిస్తాం.
- సమస్యల విషయంలో రాష్ట్రంలోని ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమల్లోని ప్రాంతాల రైతులు నష్టాల ఊబిలో చిక్కుకున్నారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నారాయణ రెడ్డి, జిల్లా కార్యదర్శి దుర్గాదేవి, రాఘవరావు, ఎస్.ఎ గఫూర్, వైహెచ్‌కె మోహనరావు, పట్టణ అధ్యక్షుడు సేగు రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు ఉపేంద్ర, కార్యదర్శి చీతిరాల కాశీరావు, గోళ్ళ కిరణ్‌కుమార్, బుంగాశివరామయ్య, ఎస్. కొండలు, గోపవరపు శ్రీనివాసారావు, ఈదర గోపీచంద్, పాత వెంకటేశ్వర్లు, సీహెచ్ రామారావు, గుంటూరు పట్టణ అధ్యక్షుడు శరత్‌బాబు, కె. లలితకుమారి, రైతులు పాల్గొన్నారు.

### ఆహార భద్రత ఘనకార్యమా?

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 63 ఏళ్ళలో కాంగ్రెస్ పార్టీ కేవలం 12 ఏళ్ళు అధికారానికి దూరంగా వుంది. 51 ఏళ్ళపాటు అధికారంలో వుండి, దేశం మొత్తాన్నే శాసించిన పార్టీ 63 ఏళ్ళ తర్వాత కూడా దేశంలో ఇంకా 90 శాతం తిండిలేకుండా వున్నారు. అందరికీ తిండి ఉచితంగా పెడుతున్నామని అంటే, దాన్నేదో ఘనవిజయంగా వాళ్ళు చెబుతూ ఉంటే మనం చెవిలో పువ్వులు పెట్టుకుని వింటుంటే... కన్నీళ్ళు తెచ్చుకోవాలో, కోపం తెచ్చుకోవాలో అర్థం కావడం లేదు. వాళ్ళు చెప్పేదే నిజమైతే ప్రజల్ని ఇంకా ఈ దుస్థితిలోనే ఉంచినందుకు వాళ్ళంతా ఉమ్మడిగా ఉరేసుకుని చచ్చిపోవాలి. చెప్పేది అబద్ధమైతే వ్యవసాయాన్ని నాశనం చేయడం కోసం, బీదవాళ్ళను బీదవాళ్ళుగానే ఉంచేందుకు కుట్ర జరుగుతోందని భావించాలి. ఈ రెండింటిలో ఏదైనా క్షమించరాని నేరమే.

# కృష్ణాజిల్లా

### కూచిపూడి

- వ్యవసాయంలో మౌలికమైన కొత్త ఆలోచనలు రావాలి. రాష్ట్రంలో కోటీ 20 లక్షల మంది రైతులుండగా, వీరిలో 30 లక్షలకు పైగా కౌలురైతులు ఉన్నారు. రాష్ట్రంలో సహకార సంఘాలు ప్రభుత్వ కబంధహస్తాల్లో నలిగిపోతున్నాయి. ప్రభుత్వ కో-ఆపరేటివ్ వ్యవసాయ సొసైటీల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. ప్రభుత్వ పెత్తనం లేకపోవడంతో కృష్ణాజిల్లా పాడి పరిశ్రమ సమాఖ్య లాభాల బాటలో ముందుకు దూసుకుపోతుంది. కానీ ప్రభుత్వ ఆజమాయిషీలో వున్న చిత్తూరు, కడప, గోదావరి జిల్లాల డెయిరీలు మూతపడ్డాయి. రాష్ట్రంలో అదనంగా 30 లక్షల టన్నుల గోడౌన్ల నిర్మాణాన్ని చేపట్టాలి. ఈ కార్యక్రమం లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు కోనేరు వెంకట పూర్ణ బసవేశ్వరరావు, కె. పట్టాభిరామయ్యా, రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎర్నేని నాగేంద్రనాధ్, వజీర్, జానకి రామయ్య, వెంకట రామకృష్ణ, లీలా కృష్ణయ్యా, పూర్ణచంద్రరావు, రాజమణి, శైలజ, వెంకట కృష్ణారావు, రామకృష్ణారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### గూడూరు

- కులంపేరుతో, మతంపేరుతో, పార్టీల పేరుతో ముక్కలైన రైతాంగం ఒక్క తాటిపై వచ్చి సమిష్టిగా పోరాడినప్పుడే ఢిల్లీ పాలకులు దిగి వస్తారు.
- బందరు ఎమ్మెల్యే పేర్ని నాని "సొంత జెండా, ఎజెండా వున్న జేపీ రైతు వ్యతిరేక విధానాలను విమర్శించడమే కాక సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేయడం ఆయనకే చెల్లింది. రైతు సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని జేపీ చేస్తున్న ఉద్యమానికి పూర్తి మద్దతు ఇస్తున్నాను" అన్నారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు చెన్నుపాటి వజీర్, ప్రధాన కార్యదర్శి చుండూరి రాజేంద్రప్రసాద్, రైతు సమాఖ్య అధ్యక్షుడు ఎర్నేని నాగేంద్రనాధ్, పద్మశ్రీ గౌరివర్తి నరసింహరాజు యాదవ్, మహిళాసత్తా అధ్యక్షురాలు వి. శ్రీదేవి, మచిలీపట్నం ఇన్‌చార్జి ఎం.వి. నాగేశ్వరరావు, మాగంటి రామకృష్ణ, అజ్మతున్నిషా, జంపాన్ శ్రీనివాస గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### పెనమలూరు

- రాష్ట్రాల మధ్య ఆహారధాన్యాల ఎగుమతులకు ఆంక్షలు ఉండకూడదు. అంతర్జాతీయ మార్కెట్‌లో బాగా ధరలు పలుకుతున్నప్పుడు ప్రభుత్వ సంస్థల ద్వారా ఎగుమతులు చేసి అదనంగా వచ్చిన లాభాల్ని రైతులకు అందించే ఏర్పాటు చేయాలి.
- ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రైతు నుదుటిరాత మారటం లేదు.
- వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు ఎలా పెంచాలన్న విషయంపై ప్రభుత్వాలు శ్రద్ధ వహించడం లేదు.
- మనదేశంలో వివిధ రాజకీయ పార్టీలకు, అనుబంధంగా వుండే ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య, వైద్య, న్యాయవాద వృత్తిలో ఉండే వారు తమ న్యాయబద్ధమైన డిమాండ్ల కోసం సంఘటితమై సాధిస్తారు. ఆ తరహా ఐక్యత మాత్రం రైతుల్లో కానరావడం లేదు.
- రాజకీయాలను శాసించే సత్తా కేవలం రైతులకే వుంది. దీన్నే ఓ ఆయుధంగా మలుచుకొని తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యతతో పోరాడాలి.
- కూరగాయలు పండే పెనమలూరు నియోజకవర్గంలో పలు గ్రామాలకు కోల్డ్‌స్టోరేజ్ అవసరం వుంది.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుపాటి వజీర్, అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మగడ్డ మోహన్‌డాంగే, అధ్యక్షుడు చుండూరి రాజేంద్రప్రసాద్, డా॥ పట్టాభిరామయ్యా, బసవేశ్వర్‌రావు, డి. సరళకుమారి, వాడవల్ల శ్రీదేవి, జ్ఞానాంభ, చెన్నుపాటి కోటయ్య, పిసిసి కార్యదర్శి కొలనుకొండ శివాజీ, సర్పంచ్ కిలారు వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు కొల్లి నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

### బంటుమల్లి

- ఉపాధి హామీ పథకం 50% నిధులను వ్యవసాయ పనులకు కేటాయించేలా ప్రణాళిక రూపొందించాలి.
- లక్ష కోట్ల బడ్జెట్ వున్న రాష్ట్రంలో రైతులకు కనీసం 10% నిధులు కూడా కేటాయించడం లేదు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువసత్తా ప్రధాన కార్యదర్శి రాజా రామకృష్ణ వర్మ, రైతు సమాఖ్య అధ్యక్షుడు ఎర్నేని నాగేంద్రనాధ్, పీఆర్పీ ఉపాధ్యక్షుడు ఎస్.వి. రాజు, గౌరిశెట్టి నాగేశ్వరరావు, లోక్‌సత్తా నాయకులు పట్టాభి రామయ్యా, బసవయ్యా, వజీర్, అజ్మతున్నీషా, పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్ము ఏడుకొండలు, రైతులు పాల్గొన్నారు.

### ఓటు విషయంలో జాగ్రత్త - యువతకు జేపీ సూచన

'మీకు నచ్చిన వారిని పెళ్ళి చేసుకోండి. నచ్చిన పాలకులను ఎంచుకోండి. ఇందులో కులగోత్రాలు రాజకీయాలకు సంబంధంలేదు. స్వతంత్ర్యంగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి. ఓటువేసే విషయంలో తగు జాగ్రత్త వహించకుంటే... ఐదేళ్ళపాటు పశ్చాత్తాపపడవలసి వస్తుంది.

# గుంటూరు

## విద్యార్థులకు ప్రపంచ జ్ఞానం అవసరం

**సత్తెనపల్లి రూరల్ :** చదువుతోపాటు ప్రపంచాన్ని అర్థం చేసుకునే శక్తి విద్యార్థులు పెంపొందించుకోవాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ కన్వీనర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. జన చైతన్య యాత్రలో భాగంగా అక్టోబర్ 26న సత్తెనపల్లి వచ్చిన ఆయన అన్నం గురవమ్మ కృష్ణమూర్తి డిగ్రీ కళాశాలను సందర్శించారు. విద్య విజ్ఞానాన్ని, ఉపాధిని కల్పిస్తుందన్నారు. నిరుద్యోగ సమస్య ఎక్కువగా వుందని, ఉద్యోగాల కోసం యువత ఎదురు చూస్తున్నారన్నారు.

## ప్రజాసేవే రాజకీయం

ప్రజలకు నిజమైన సేవ చేయడమే రాజకీయం అని జేపీ అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు లాయర్ వృత్తిని వదిలి సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చి రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారన్నారు. చివరి దశలో ఆయనకు తినడానికి తిండి కూడా లేదన్నారు. ఆనాడు నిజాయితీగా రాజకీయాల్లో ఉన్న నాయకుల మనుమళ్ళు నేడు బంట్రోతులుగా మిగిలారన్నారు. నేటి రాజకీయాలు మాత్రం అందుకు విరుద్ధంగా వున్నాయని అన్నారు. ప్రజల జీవన ప్రమాణస్థాయి మెరుగుపడాలంటే రాజకీయాల్లో పెనుమార్పులు అవసరమన్నారు. దీనికి యువత ముఖ్యభూమిక పోషించాలన్నారు.

## సిమెంటు ఫ్యాక్టరీలు నిర్మించాల్సిందే

**పిడుగురాళ్లటౌన్:** పల్నాడు ప్రాంతంలో సిమెంటు ఫ్యాక్టరీల కోసం భూములు సేకరించి ఫ్యాక్టరీలు నిర్మించకుండా జాప్యం చేయటం పద్ధతి కాదని వెంటనే ఆయా ఫ్యాక్టరీల నిర్మాణం చేపట్టాలని జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో రైతులు ఫ్యాక్టరీల నిర్మాణం కోసం చట్టప్రకారమే భూములు అమ్మారని, వాటిని తిరిగి అప్పగించమనటం సమంజసం కాదన్నారు. ఫ్యాక్టరీ నిర్మించటంలో జరిగిన జాప్యం రైతులకు కొంత అనుమానాన్ని కల్గించిందని, ఈ ప్రాంత రైతులు ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మిస్తే తమ పిల్లలకు ఉద్యోగ అవకాశాలు వస్తాయనే ఆశతో అమ్మకాలు చేశారని దాన్ని దృష్టిలో పెట్టుకొనే యాజమాన్యం ముందడుగు వేయాలన్నారు. పేదలందరికీ ఇళ్లు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కలుగచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుందన్నారు. పిడుగురాళ్లలో ఇళ్ల స్థలాల కోసం 100 రోజులుగా నిరాహారదీక్షలు చేస్తుంటే అధికారులు స్పందించటం లేదంటే జిల్లాలో ప్రభుత్వం పనిచేస్తుందా అని ప్రశ్నించారు. పేదలందరు గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణాలు అందిస్తే వారందించిన వడ్డీతోనే వారికే మరలా రుణ సదుపాయం కల్గించే పద్ధతిని ప్రవేశపెట్టాలన్నారు. అనంతరం ఆయన మన గ్రోమోర్ సెంటర్‌లో రైతులతో ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబుజా సిమెంట్సు బాధిత రైతుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆయనకు వినతిపత్రం అందచేశారు. ఈ సమావేశంలో ఎస్.ఏ. గఫూర్, వై హెచ్ కె. మోహన్‌రావు, లోక్‌సత్తా పట్టణ అధ్యక్షుడు సేగు రమేష్, ఉపాధ్యక్షుడు ఉపేంద్ర, చీతిరాల కాశీరావు, బుంగా శివరామయ్య, గోళ్ల కిరణ్‌కుమార్, నారాయణ తదితరులున్నారు.

## ఎగుమతులతోనే రైతులకు లబ్ది చేకూరుతుంది: జెపి

**శావల్యాపురం :** కులపార్టీలతో ప్రభుత్వాలు రైతును ఇబ్బందులకు గురిచేస్తున్నాయని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు, వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మండల పరిధిలోని వేల్పూరు గ్రామంలో రైతులతో ఇష్టాగోష్టి కార్యక్రమాన్ని లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు రాష్ట్ర ఉపాధ్యక్షులు జజ్జూరి బిరామమూర్తి అధ్యక్షత వహించగా డా॥ జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ, రైతులు ఐక్యంగా ప్రభుత్వాలపై పోరాడితే సమస్యలు నెరవేరుతాయన్నారు. నేటి సమాజంలో ప్రభుత్వ పనితీరు వలన ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఉన్నాయని, విదేశాల ఎగుమతులు లేకపోవటం వలన రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదని, అంతర్జాతీయ మార్కెట్‌లో బిపిటి ధర రూ.130 ఉంటే, మనరాష్ట్రంలో కనీస మద్దతు ధర లభించటంలేదని ఆయన అన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి స్వర్ణాల వెంకట్రావు, సిఐటియు బోడపాటి అప్పారావు, నరేంద్రనాథ్, నాగిరెడ్డి, పారా హైమారావు, చుండూరి వెంకటేశ్వర్లు, గోపుశ్రీరాములు, స్వర్ణాల నాగేశ్వరరావు, గ్రామస్తులు, మండల ప్రజానీకం పెద్ద సంఖ్యలో పాల్గొనగా శాంతిభద్రతలను ఎస్.ఐ ఎం. బాబూరావు, మోహన్‌రావులు సిబ్బంది పర్యవేక్షించారు.

**వివిధ అంశాలపై మీరడిగే ప్రశ్నలకు**

**డా॥ జేపీ సమాధానాలిస్తారు. ప్రచురించబడిన ప్రతి ప్రశ్నకు రూ॥ 100/- పారితోషికం ఇవ్వబడును**

## సూచన

**మీ జిల్లాలో లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు తదితర సమాచారాన్ని తప్పనిసరిగా ఫొటోలతో పాటు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించండి. వీలువెంబడి వాటిని వరుసగా ప్రచురిస్తాం. స్థానికంగా మీ కార్యక్రమాల్ని రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలియజేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోండి.**

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం

## విజయనగరం



### లోక్‌సత్తాలో చేరిన 'చింతల పూడి'

**విజయనగరం :** పట్టణంలో 32వ వార్డు బలిజి వీధికి చెందిన సీనియర్ నాయకులు పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షులు చింతలపూడి అప్పలరాజు లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ... రాజకీయాల పట్ల అవగాహన ఉన్న వాళ్ళు పట్టణం అభివృద్ధి కోసం లోక్‌సత్తా పార్టీలో చేరి నాయకత్వ బాధ్యతలు చేపట్టాలని పిలుపునిచ్చారు. చింతలపూడి మాట్లాడుతూ... లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ ఆశయాలు, పార్టీ పనితీరు నచ్చి పార్టీలో చేరానని తెలిపారు.

### రాకోడు పీహెచ్‌సీని సందర్శించిన లోక్‌సత్తా

మండలంలోని రాకోడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని లోక్‌సత్తా పార్టీ నాయకులు సందర్శించారు. ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి అనంతరం అక్కడ రోగులకు లభిస్తున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. డా॥కె.రవికుమార్‌లో కాసేపు మాట్లాడి సమస్యలేమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా ప్రతినిధి ఎం.ఎస్.ఎస్.రాజు, మహిళాసత్తా అధికార ప్రతినిధి ఐ.అనంతలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### లోక్‌సత్తా సభ్యత్వ నమోదు

**వీటిఅగ్రహారం :** స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద లోక్‌సత్తా పార్టీ స్టాల్‌ను ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రజలకు పార్టీ పట్ల రోజురోజుకు ఆదరణ పెరుగుతున్నందున సభ్యత్వ నమోదు కర్యాక్రమాన్ని చేపట్టామని స్థానిక యువసత్తా నాయకుడు పి.వి.రమణ తెలిపారు. సుపరిపాలన కోసం ప్రజలు లోక్‌సత్తాతో కలిసి ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో యువసత్తా నాయకులు కె.దయానంద్, తాడెల వెంకటరావు, శ్రీనివాసరాజు, కె.డానియల్ తదితరులు పాల్గొన్నారు.

### 'చేతి' నీడలో సాగిన దర్యాప్తు

**విజయనగరం :** రాష్ట్రంలో పెనుదుమారం లేపిన వోక్స్‌వ్యాగన్ కేసులో అయిదేళ్ళపాటు దర్యాప్తు సాగించిన సి.బి.ఐ. 59 మంది సాక్షులను విచారించి చివరకు మంత్రికి, సంబంధిత అధికారులకు ఈ కుంభకోణంతో సంబంధం లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. వోక్స్ వ్యాగన్ కుంభకోణం నుంచి మంత్రితో పాటు అధికారులు తప్పించుకున్నా, ప్రపంచదేశాల్లో మన రాష్ట్రం మాత్రం నవ్వుల పాలైందని తెలిపారు. వోక్స్‌వ్యాగన్ కంపెనీల చైర్మన్ ఎవరో తెలియకుండా ప్రభుత్వం నిధులు విడుదల చేయడం మన పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనమని బాబ్జీ తీవ్రంగా విమర్శించారు.

### 'ఉపాధి' అవినీతిపై గ్రామాల్లో పర్యటిస్తాం

**కొమరాడ :** కొమరాడ మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం అవినీతి అక్రమాలపై గ్రామాల్లో పర్యటించి ప్రజల ముందుంచుతామని లోక్‌సత్తా నాయకుడు పట్లాసింగు రవికుమార్ అన్నారు. సర్పంచ్ చేసిన పనులకే 16శాతం పీసీల రూపంలో ఉపాధి హామీ సిబ్బంది వసూళ్ళు చేయడం అవినీతికి బీజం పోసినట్లైందన్నారు. పనులు నిర్వహించకుండా బిల్లులు మంజూరైనట్లు ఆరోపణలున్నాయన్నారు. సామాజిక తనిఖీల్లో సుమారు రూ॥19 లక్షలకుపైగా అక్రమాలు వెలుగులోకి రావడం ద్వారా కొమరాడ మండలం అక్రమాలకు నిలయంగా మారిందన్నారు.

### ఆరోగ్యకేంద్రాల్లో సిబ్బందిని నియమించాలి : లోక్‌సత్తా

**పార్వతీపురం :** ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు సంపూర్ణ వైద్యసేవలందించేందుకు పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని లోక్‌సత్తా నియోజక వర్గ ఇన్‌చార్జి పట్లాసింగు రవికుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని బందలుప్పి, డోకిశీల, పెదబండపల్లిల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వేలకోట్లు కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రభుత్వం దొడ్డిదారిన మళ్ళిస్తోందని, అందువల్ల ప్రభుత్వ ఆసుపత్రులను పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తకోట అప్పారావు, బి.వెంకటరమణ, ఎ. ప్రభాకరరావు, జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## సక్రమంగా సరుకులు అందించాలి : లోక్‌సత్తా

**బొబ్బిలి :** రేషన్ డిపోల ద్వారా నిత్యవసర సరుకులను సక్రమంగా అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని లోక్‌సత్తా నాయకులు వి.లక్ష్మీనాయుడు, గంగరాజులు డిమాండ్ చేశారు. రేషన్ షాపుల ద్వారా సక్రమంగా సరుకులు అందడం లేదని వినియోగదారులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. అలాగే రేషన్ డిపోల వద్ద సరుకుల వివరాలు, సమయాలు, ధరలను తప్పనిసరిగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తే వినియోగదారులకు ఎటువంటి నష్టం వాటిల్లదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ సుదర్శన్ దొరకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు సూరిబాబు, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

# గుంటూరు




## లోక్‌సత్తా పార్టీ 4వ వార్షికోత్సవ సభ

**గుంటూరు :** రాజకీయ పార్టీగా రూపుదాల్చి 4 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 4వ వార్షికోత్సవ సభ జిల్లాలో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో అరండల్ పేటలోని వావిలాల సంస్థలో జరిగింది. ఈ సభకు నగర లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు డా॥శరత్‌బాబు, జిల్లా పార్టీ అధ్యక్షులు నారాయణ రెడ్డి, చెన్నుపాటి వజీర్, చందూరి రాజేంద్ర ప్రసాద్, వావిలాల మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వజీర్ మట్లాడుతూ... కుల, మత, ప్రాంతం పేదరికం కారణంగా ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారన్నారు.

రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... ప్రజలే ప్రభువులు పాలకులు సేవకులే అని చెప్తున్న లోక్‌సత్తా పార్టీయే ప్రజలకు నిజమైన సేవ చేయగలదన్నారు. జిల్లా అధ్యక్షులు నారాయణరెడ్డి మాట్లాడుతూ.. వరదల కారణంగా దెబ్బతిన్న ఓలేరు గ్రామ దళితులకు కమ్యూనిటి హాలును పార్టీ పరంగా నిర్మించడం జరిగిందన్నారు. అనంతరం లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో కె. సాంబయ్య, మహిళాసత్తా కార్యదర్శి కె.దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.




## లోక్‌సత్తా ఆధ్వర్యంలో శ్రమదానం

**నరసరావు పేట :** స్థానిక చెరువుకట్ట రోడ్డు నుండి ఇందిరా గాంధీ బొమ్మవైపు వేళ్ళే మార్గంలో కూలిన చప్టాను మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నందుకు నిరసనగా స్థానిక లోక్‌సత్తా నాయకులు అక్కడ శ్రమదానం చేసి ప్రమాద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. తెలియక వచ్చే వారు, వృద్దులు, పిల్లలు చప్టాదాటే సమయంలో గుంటలో పడిపోయే ప్రమాదం ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టక పోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఈదర గోపీచంద్, రామలింగారెడ్డి, జిల్లా మహిళా సత్తానేత కె. లలితకుమారి, పాత వెంకటేశ్వర్లు, బి.పోతురాజు, షేక్ మస్తాన్‌వలి, ఆళ్ళ సుబ్బారెడ్డి, కటికం చినపేరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేజర్ల పాఠశాలకు లోక్‌సత్తా విరాళం :-

**నకిరేకల్లు :** మండలంలోని చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, విద్యార్థినీ విద్యార్థులకు మరుగుదొడ్లు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో లోక్‌సత్తా జిల్లా మహిళా నాయకురాలు కె. లలిత కుమారి తన వంతు సాయంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెహిద్దీన్ సాహెబ్‌కు ఐదువేల రూపాయలు విరాళం అందచేశారు. కార్యక్రమంలో నాయకులు ఈదర గోపీచంద్, మధుసూధన్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు వేయించండని కమిషనర్‌కు లోక్‌సత్తా వినతి :

**నరసరావు పేట :** తమ వార్డులోని రోడ్ల దుస్థితిపై 26వ వార్డు మహిళలు లోక్‌సత్తా పార్టీ పట్టణ అధ్యక్షులు ఈదర గోపీచంద్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కె. రామ్మోహన్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భూగర్భ డ్రైనేజీ పనుల వల్ల గోతులు, నీటి గుంటలు అధికంగా ఉన్నాయన్నారు. సిమెంట్ రోడ్డు వేసేలోపు తాత్కాలిక మరసరోడ్డు యుద్ధ ప్రాతి పదికన వేసి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళ సుబ్బారెడ్డి, పి.హనుమంత్‌రావు, చిన్న పేరిరెడ్డి,

సత్యవతి, అనురాధ, నిర్మల, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

**జేపీని కలిసిన బైపాస్ వ్యతిరేక కమిటీ సభ్యులు**

**చిలకలూరిపేట :** లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ గుంటూరు జిల్లా పర్యటనలో భాగంగా అక్టోబర్25న గుంటూరు అతిథిగృహంలో చిలకలూరిపేటకు చెందిన బైపాస్ వ్యతిరేక కమిటీ సభ్యులు, రైతులు ఆయనను కలిశారు. చిలకలూరిపేట బైపాస్ నిర్మాణం వలన 472 మంది రైతులు 321 ఎకరాలు భూమిని నష్టపోయి రోడ్డునపడుతున్నారని వివరించారు. రాజకీయ నాయకులుగానీ, అధికారుల గానీ తమ సమస్యపై స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై నేషనల్ హైవేస్ అధికారులతో జయప్రకాష్ నారాయణ ఫోన్‌లో సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైవే అధికారులు అనాలోచితంగా నిర్ణయం తీసుకున్నారని, మళ్లీ హైవేస్ అధికారులను సంప్రదించి అవసరమైతే ప్రధానమంత్రి దృష్టికి ఈ విషయం తీసుకువెళతామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డా॥ కొల్లా రాజరామోహరావు, లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రసాద్, పట్టణ అధ్యక్షుడు షేక్ జబ్బార్, బైపాస్, వ్యతిరేక కమిటీ కార్యదర్శి సిద్దిక్, రైతులు రాజు, చక్రయ్య, మహమ్మద్ మియా, బాషా తదితరులు ఆయనను కలిశారు.

## వరంగల్



**హోంగార్డుల సమస్యలపై ర్యాలీ, వినతి పత్రం సమర్పణ**

**వరంగల్ :** లోక్‌సత్తా పార్టీ అధ్వర్యంలో హోం గార్డుల సమస్యలపై ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు జట్టి రవి కుమార్ మాట్లాడుతూ... హోం గార్డులకు తెల్లరేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, పీఎఫ్ లాంటివి వర్తింపచేయాలని, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అనంతరం జిల్లా అర్బన్ ఎస్‌పి జె. ప్రభాకర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కె. శ్రీనివాస్, సోల్తిసారయ్య, సోమేశ్వర్, కరుణాకర్, లక్ష్మణ్, రామారావు, విద్యార్థి విభాగం నాయకులు దేవర సురేష్, బానోతురాజునాయక్, జట్టి రమణకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో హోంగార్డుల సమస్యలపై ర్యాలీ

## కర్నూలు

**విద్యావలంటీర్లను రెన్యువల్ చెయ్యాలి**

**పత్తికొండ :** సంక్షేమ హాస్టల్లో పనిచేస్తున్న విద్యావాలంటీర్లను రెన్యువల్ చేయాలని లోక్‌సత్తా పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కె. ఆనందాచారి డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల సంక్షేమం కోసం వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన విద్యావాలంటేర్ల వ్యవస్థను రద్దు చేయడం అన్యాయమన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో వార్డెన్లు విద్యార్థుల చదువుకు ఏమాత్రం శ్రద్ధ వహించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ మాధవరెడ్డి, గోపాల్, ఎర్రిస్వామి మహమ్మద్, రంగన్న విద్యావాలంటీర్లు పాల్గొన్నారు.

**ఘనంగా లోక్‌సత్తా వార్షికోత్సవం**

**పత్తికొండ :** లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించి 4 ఏళ్ళు అవుతున్న సందర్భంగా స్థానిక నాయకులు కేక్‌ను కట్ చేశారు. పార్టీ పతాకాన్ని నియోజక వర్గ ఇన్‌ఛార్జీ ఆనందా చారి ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ ప్రతినిధులను గెలిపించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, ప్రసాద్, మాధవ రెడ్డి, సుదర్శన్, మహ్మద్, సుధాకర్, క్రిష్ణయ్య, ఎర్రిస్వామి, లక్ష్మీస్వామి తదితరులు పాల్గొన్నారు.

**హడావిడిగా పుస్తకం మొత్తం చదవడం కంటే,**
**జీర్ణించుకుంటు ఒక్కొక్క పేజీ చదవడం మేలు**

– ఏకాలే

# ప్రకాశం

## మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కండి

**ఒంగోలు :** ఇప్పటి వరకు ఉన్న లోపాలను సవరించుకుని మున్సిపల్ ఎన్నికలకు లోక్‌సత్తా శ్రేణులు సంసిద్ధం కావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లు శివరమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ నాలుగో వార్షికోత్సవ సందర్భంగా పార్టీ కార్యలయంలో కేక్ కోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి కార్యకర్తలు నేతలు సన్నదం కావాలన్నారు. ఒంగోలు, చీరాల మున్సిపాలిటీల్లోని అన్ని వార్డుల్లో పార్టీ తరపున అభ్యర్థులను నిలుపుతామన్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రం ఒంగోలు, సమస్యల గుండంలో కొట్టుమిట్టాడుతుందని, దంపింగ్ యార్డ్ స్థలం కేటాయించాలని, మంచి నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉ ద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చప్పిడి రత్నకుమారి, రాష్ట్రక్రమశిక్షణా సంఘం సభ్యులు డా॥ఎన్ రాధాదేవి, ఉపాధ్యక్షులు మహమ్మద్ రఫీ, జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, నియోజక వర్గ అధ్యక్షుడు జానకి రామ్, మారుతి ప్రసాద్, శివకుమార్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పై అవగాహన అవసరం

**సంతనూతల పాడు :** విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ వైద్యురాలు లోక్‌సత్తా పార్టీ నాయకురాలు ఎన్.రాధాదేవి అన్నారు. స్థానిక ఎం.ఎస్.ఆర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా 290 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారికి ఆరోగ్యం పై అవగాహన కల్పించారు. వ్యసనాలకు లోనై ఆరోగ్యాలు పాడు చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో సిండికేట్ రైతు సేవాసంఘం ఎండీ పి.వి.సుబ్బారావు, నాగార్జున యునివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥డి.వెంకటేశ్వరరెడ్డి, డా॥ రంగాచార్యులు రాంప్రసాద్ పాల్గొన్నారు.

## పార్టీ కార్యాలయంలో బాపూకి ఘన నివాళి

**ఒంగోలు :** స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ... గాంధీజీ కన్న కలలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు నారాయణం రాధాదేవి, జిల్లా కార్యదర్శి చప్పిడి రత్నకుమారి, ఎం.శ్రీనివాసరావు, ఎం.మాధవి, జె.జానకీరామ్ పాల్గొన్నారు.

# తూర్పుగోదావరి




## నగర లోక్‌సత్తా ఆధ్వర్యంలో జవాన్‌కు, కిసాన్‌కు సన్మానం

**రాజమండ్రి :** లోక్‌సత్తా పార్టీ 4వ వార్షికోత్సవ దినోత్సవం పురస్కరించుకొని సుమారు 4 దశాబ్దాల పాటు ఎయిర్‌ఫోర్సులో సేవలందించి, రెండు యుద్ధాల్లో పాల్గొన్న మంత్రివాడ నాగేశ్వరరావు (జవాన్)ను పార్టీ నాయకులు డా॥వి.వి.రామారావు, జల్లారవి, ఎన్.ఎస్.రామచంద్రమూర్తి సత్కరించారు. అలాగే 70సం॥పై బడిన వృద్ధరైతు శ్రీ మల్లిన వెంకట సుబ్బారావును ఆర్.చంద్రకళ, డి.వి.ఆర్. సూర్యారావు, వి.వి.రామారావులు సత్కరించారు. కార్యక్రమంలో జి.రామరాజు, పువ్వాడ నాగేశ్వరరావు, తాళ్ళపూడి శివసత్యనారాయణ, ఇ.బి.శంకరయాదవ్, ఎన్.శ్రీనివాసరావు, టి. మల్లిఖార్జున రావు, గుర్రాల వెంకటరావు, కె.వి.వి.సత్యనారాయణ రెడ్డి, కె. శ్యాంబాబు, ఎస్.బుచ్చయ్య చౌదరి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం

## రహదారులకు మరమ్మత్తులు చేపట్టండి

**చర్ల :** లక్షల రూ॥ల వ్యయంతో నిర్మించిన ప్రధాన రహదారులు కొద్ది కాలానికే గోతుల మయంగా మారాయని, జడ్పీ అధికారులు స్పందించి రహదారులకు మరమ్మత్తులు చేయించాలని లోక్‌సత్తా మండల ఇన్‌ఛార్జి వి.వి.రమణ, అధ్యక్షులు చింతూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు సి.హెచ్. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అంతక ముందు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీజి వ్యతిరేకించిన మద్యంను పల్లెపల్లెల్లో పారదోలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సి.హెచ్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి వి.వి.రమణ, సిహెచ్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా లోక్‌సత్తా వార్షికోత్సవం**

**చర్ల :** లోక్‌సత్తా పార్టీ నాల్గవ ఆవిర్భవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ కమిటీ సెంటర్లో పార్టీ పతాకాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి చింతల లింగేశ్వరరావు ఆవిష్కరించారు.



## శ్రీకాకుళం

**స్వాతంత్ర్య సమరయోధునికి సన్మానం**

**సారవకోట :** పార్టీ నాల్గవ వార్షికోత్సవ సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు బోయిన కామరాజును నరసన్నపేట నియోజకవర్గ అధ్యక్షులు మామిడి సత్యనారాయణ లోక్‌సత్తా పార్టీ తరపున ఘనంగా సన్మానించారు. ముందుగా శాఖ గ్రంథాలయ ఆవరణలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సారవకోట అప్పారావు, కలమట మల్లేశ్వరరావు, సారవకోట సత్యం, ముచ్చేటి కామేశ్వరరావు, మంద సూర్యనారాయణ, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



**అహింసా మార్గమే మానవ శ్రేయస్సుకు మంచిది**

**సారవకోట :** గాంధీ జయంతి సందర్భంగా లోక్‌సత్తా పార్టీ నాయకుడు మామిడి సత్యనారాయణ కార్యకర్తల చేత అహింసా మార్గమే మానవ శ్రేయస్సుకు మంచిదని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం స్థాపనకోసం లోక్‌సత్తా పార్టీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు జులుమూరు మండల లోక్‌సత్తా ప్రతినిధి ఎం.ప్రసాదరావు, బొజ్జమ్మ, ఎం.సూర్యనారాయణ, టి.గణపతిరావు, కె.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**లోక్‌సత్తా పై ప్రజల్లో అవగాహన పెరుగుతుంది**

**జులుమూరు :** లోక్‌సత్తా పార్టీ సిద్ధాంతాలపై రానురాను ప్రజల్లో అవగాహన పెరుగుతుందని లోక్‌సత్తా పార్టీ కౌన్సిల్ సభ్యులు మామిడి సత్యనారాయణ అన్నారు. లోక్‌సత్తా పార్టీ రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయం కాదని, రాజకీయానికే ప్రత్యామ్నాయమని, ఖచ్చితంగా ప్రజలను ప్రభువులుగా తీర్చిదిద్దడానికి, ప్రజలకి అధికారాన్ని కట్టపెట్టడానికి ఏ విధంగా వ్యవహరించాలో ఆ విధంగానే వ్యవహరిస్తుందన్నారు. పార్టీ సిద్ధాంతాలు ప్రజలకు పరిచయం అవుతున్నకొద్దీ పార్టీకి మద్దతు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సారవకోట మండల అధ్యక్షులు సారవకోట అప్పారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైదరాబాద్



**లోక్‌సత్తా టైమ్స్ పంపిణీకి ఏర్పాట్లు**

**హైదరాబాద్ :** లోక్‌సత్తాపార్టీ పత్రిక లోక్‌సత్తా టైమ్స్‌ను పంపిణీ చేసేందుకు జూబ్లీహిల్స్ నియోజక వర్గం ప్రతినిధులు ఏర్పాటు చేశారు. దేశ వ్యాప్తంగా పార్టీకి సంబంధించిన విశేషాలు, విషయాలు ఈ వార పత్రికలో ఉంటాయని నియోజక వర్గం అధ్యక్షుడు మల్లిఖార్జున్‌రావు, ప్రధాన కార్యదర్శి వి.ఎన్.పవన్ కుమార్ తెలిపారు. పేపర్‌బాయ్స్ ద్వారా దినపత్రికల మధ్యలో ఉంచి లోక్‌సత్తా టైమ్స్‌ను పంపిణీ చేయడంతో పాటు ఇంటింటికి అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# కృష్ణా జిల్లాలో జేపీ










RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12




To,

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad